TIMES OF VARTHA (24-10-2024)M_times of varha main (13-2).qxd 10/24/2024 6:34 AM Page 1


# టైమ్స్ ఆఫ్ వార్త

తెలుగు దినపత్రిక

ఎడిటర్ : గూడూరు జనార్థన్ రెడ్డి

తెలంగాణ | గురువారం, 24 - అక్టోబర్ - 2024 | సంపుటి : 16 | సంచిక : 78 | పేజీలు 06 | వెల : 6/-


## భారత్, చైనా మధ్య

# శాంతి సుస్థిర బంధం



కజాన్: సుమారు ఐదు సంవత్సరాల్లో తొలిసారిగా ప్రత్యేక ద్వైపాక్షిక చ ర్చల్లో భారత ప్రధాని నరేంద్ర మోడీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ భార త్, చైనా పరిణతి, పరస్పర గౌరవం ప్రదర్శిస్తూ 'శాంతియుత, సుస్థిర' సంబంధం కలిగి ఉండగలవని బుధవారం అంగీకరించారు. తూర్పు లడఖ్‌లో దీర్ఘకాలంగా సాగుతున్న సరిహద్దు వివాదం పరిష్కారంపై ఒప్పందాన్ని ఉభయ నేతలు ధ్రువీకరించారు. వాస్తవ నియంత్రణ రేఖ (ఎల్‌ఎ సి) పొడుగునా శాంతి, సుస్థిరతలకు విఘాతం కలిగించే సరిహద్దు సం బంధిత విషయాలపై విభేదాలన సాగనివ్వవలసిన అవసరం లేదని మో డీ ఈ సమావేశంలో స్పష్టం చేశారు. భారత్, చైనా సరిహద్దు సమస్యపై ప్రత్యేక ప్రతినిధులు (ఎస్‌ఆర్) సరిహద్దు ప్రాంతాల్లో శాంతి, సుస్థిరతల కొనసాగింపునకు, వివాదం పరిష్కారంలో కీలక పాత్ర పోషించవలసి ఉంటుందని ఉభయ నేతలూ సూచించారు. సాధ్యమైనంత త్వరలో సమావేశమై, తమ యత్నాలను కొనసాగిం చాలని ప్రత్యేక ప్రతినిధులను మోడీ, జిన్‌పింగ్ ఆదేశించినట్లు విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిశ్రి మీడియా గోష్ఠిలో తెలియజేశారు. 'ఒక సముచిత తేదీన ప్రత్యేక ప్రతినిధుల తదుపరి సమావేశాన్ని ఏర్పాటు చేయగలమని ఆశిస్తున్నాం' అని ఆయన చెప్పారు. వ్యూహాత్మక, దీర్ఘ కాలిక దృక్పథంతో ద్వైపాక్షిక సంబంధాల పరిసిథతిని మోడీ, జిన్‌పింగ్ సమీక్షించారని, రెండు దేశాల మధ్య స్థిరమైన సంబంధాలు ప్రాంతీయ, ప్రపంచ శాంతి, సౌభాగ్యాలపై సకారాత్మక ప్రభావం ప్రసరిస్తాయని వారు భావిస్తున్నారని విదేశాంగ శాఖ కార్యదర్శి తెలిపారు. పరిణతి, విజ్ఞతతో, పరస్పర గౌరవం ప్రదర్శన ద్వారా భారత్, చైనా శాంతియుత, సుస్థిర సంబంధం కలిగి ఉండగలవని మోడీ, జిన్‌పింగ్ నొక్కిచెప్పారని మిశ్రి తెలిపారు. సరిహద్దు ప్రాంతాల్లో ప్రశాంతత పునరుద్ధరణ తిరిగి మామూలు సంబంధాలు నెలకొల్పడానికి దోహదం చేయగలదని ఆయన అన్నారు.

# ఒకట్రెండు రోజుల్లో పొలిటికల్ బాంబులు

## రెవెన్యూ మంత్రి పొంగులేటి వ్యాఖ్యలు

**ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం, ధరణి సహా 10 అంశాల్లో చర్యలు**

**ప్రధాన నేతలకు షాక్ తప్పదు పూర్తి ఆధారాలతో ఫైళ్లు సిద్ధం**

**తప్పు చేసింది ఎవరైనా విడిచిపెట్టం**

టైమ్స్ ఆఫ్ వార్త – హైదరాబాద్ :



దీపావళికి ముందే రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజకీయ బాంబు పేల్చారు. దక్షిణకొరియా రాజధాని సియోల్‌లో హాన్ నది పునరుజ్జీవనంపై అధ్యయనానికి వెళ్లిన పొంగులేటి అక్కడ ఓ తెలుగు చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సంచలన వ్యాఖ్యలు చేశారు. ఒకట్రెండు రోజుల్లో పొలిటికల్ బాంబులు పేలబోతున్నాయని.. ప్రధాన నేతలకు పెద్ద షాక్ ఇవ్వబోతున్నట్లు చెప్పారు. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం, ధరణి వంటి సుమారు 8 నుంచి 10 ప్రధాన అంశాల్లో చర్యలు ఉంటాయన్నారు. ఇందుకు సంబంధించి అన్ని సాక్ష్యాధారాలతో ఫైళ్లు కూడా సిద్ధం చేశామని తెలిపారు. సియోల్ నుంచి హైదరాబాద్ చేరేలోపే ఈ చర్యలు ప్రారంభమవుతాయన్నారు. ఇది కక్ష్యసాధింపు కాదని.. పూర్తి ఆధారాలతో సర్కారు చర్యలు తీసుకోబోతోందని స్పష్టం చేశారు. తప్పు చేసి ంది ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధిం చి విచారణ దాదాపు పూర్తయిందని, మొత్తానికి ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం, ధరణి అంశాలు ట్రాక్‌లో ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వం ఏర్పడ్డాక ఎలాంటి చర్యలు లేవని ప్రజలు భావించవద్దని, వారు కోరుకునే విధంగా పూర్తి ఆధారాలతో ముందుకు రాబోతున్నామని వెల్లడించారు.

# ఓటు అడగటం నాకు ఇదే తొలిసారి



**వాయనాడ్ కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రియాంకాగాంధీ నామినేషన్**

**రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ, ఖర్గే హాజరు**

**బహిరంగ వేదికపై తెలంగాణ, కర్నాటక సీఎంలు**

కల్పేట: వాయనాడ్ ఉప ఎన్నికల నేపథ్యంలో తొలిసారి ఎన్నికల బరిలోకి దిగిన ఏఐసీసీ అగ్రనేత ప్రియాంకాగాంధీ బుధవారం నామినేషన్ వేశారు. ఇక్కడి రిటర్నింగ్ అధికారికి తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. సోదరుడు రాహుల్ గాంధీ, తల్లి సోనియా గాంధీ, భర్త రాబర్ట్‌వాద్రా, కుమారుడు రైహాన్ వాద్రా, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ఇతర యూడీఎఫ్ నేతలు సహా కాంగ్రెస్ సీనియర్ నేతలు ఆమెతో కలిసి కలెక్టరేట్‌కు చేరుకున్నారు. అయితే వాయనాడ్ స్థానానికి రాహుల్ గాంధీ రాజీనామా చేయడంతో ఇక్కడ ఉపఎన్నిక అనివార్యమైంది. అంతకు ముందు జరిగిన భారీ బహిరంగ సభలో ప్రియాంకాగాంధీ మాట్లాడుతూ 1989లో 17ఏండ్ల వయస్సులో తాను తన తండ్రి రాజీవ్‌గాంధీ కోసం ఓట్లు అడగటానికి రాజకీయ ప్రచారంలో పాల్గొనడం ప్రారంభిం చానని అన్నారు. ఇప్పుడు తనకు ఓటు వేయాలని ప్రచారం చేసుకోవడం ఇదే తొలిసారి అని తెలిపారు. బీజేపీ ప్రభుత్వాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ అధికారంలో ఉన్నవారు విభజన, ద్వేషాన్ని వ్యాప్తి చేస్తున్నారని అన్నారు. అనంతరం రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. ప్రియాంకాగాంధీ ఎన్నికైతే లోక్‌సభలో వాయనాడ్‌కు ఇద్దరు ప్రతినిధులు ఉంటారని అన్నారు. "నేను అనధికారిక ప్రతినిధిని, ప్రియాంకా గాంధీ అధికారిక ప్రతినిధి. వాయనాడ్ ప్రజలతో నాకున్న సంబంధాన్ని మీరందరూ బాగా అర్థం చేసుకున్నారని నేను భావిస్తున్నా" అని అన్నారు.వాయనాడ్ స్థానానికి ప్రియాంకాగాంధీని గెలిపించాలని ఈ సందర్భంగా రాహుల్ కోరారు. ఖర్గే మాట్లాడుతూ పియాంకాగాంధీని ఆశీర్వదించండి. ఆమె వాయనాడ్‌కు మంచి ఫలితాలను అందజేస్తుందని అన్నారు. వేదికపై కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కూడా ఉన్నారు. వేలాది మంది యూడీఎఫ్ కార్యకర్తలు వీరికి ఘనస్వాగతం పలికారు. వాయనాడ్‌లో నవంబర్ 13న పోలింగ్ జరగనుంది.

# రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలు

**సీఎం రేవంత్ కబంధహస్తాల్లో పోలీస్ వ్యవస్థ**

**వెంటనే హోంశాఖ మంత్రిని నియమించాలి**

**మోదీని సంతృప్తిపరిచేలా రేవంత్ నిర్ణయాలు**

**ప్రతిగా రేవంత్ దుర్మార్గాలపై బీజేపీ మౌనం: కేటీఆర్**

**అంబర్‌పేటలో దారుణహత్యకు గురైన వృద్ధ దంపతుల కుటుంబానికి పరామర్శ**

టైమ్స్ ఆఫ్ వార్త – హైదరాబాద్ :



పోలీసు వ్యవస్థను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన కబంధహస్తాల్లో పెట్టుకున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ప్రతిపక్షాలను అణగదొక్కేందుకే పోలీసులను వినియోగిస్తుండడంతో రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించిపోయాయని, పట్టపగలే హత్యలు జరుగుతున్నాయని ధ్వజమెత్తారు. పోలీసులకు స్వేచ్ఛ ఇవ్వకుండా.. వారి విధులకు ప్రభుత్వంలోని పెద్దలు అడ్డంకులు సృష్టిస్తుండడంతో వారు డ్యూటీలు కూడా చేయలేని పరిస్థితుల్లో ఉన్నారని చెప్పారు. వెంటనే హోంశాఖ మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు.
ప్రశాంతమైన హైదారబాద్ నగరంలో పట్టపగలు హత్యలు జరుగుతున్నాయంటే రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. హైదరాబాద్‌లోని అంబర్‌పేట పోలీసస్టేషన్ పరిధి సెంట్రల్ ఎక్సైజ్ కాలనీలో ఇటీవల హత్యకు గురైన వృద్ధ దంపతులు పి.లింగారెడ్డి, పి.ఊర్మిళారెడ్డిల కుమార్తెలను బుధవారం అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌తో కలిసి కేటీఆర్ పరామర్శించారు. అనంతరం ఆయన మీడియా మాట్లాడుతూ.. హత్యకు పాల్పడ్డ వారిని వెంటనే అరెస్టు చేయాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# బండికి కేటీఆర్ లీగల్ నోటీస్





**తన పరువుకు నష్టం కలిగించేలా వ్యాఖ్యలు చేశారని నోటీసులో పేర్కొన్న కేటీఆర్**

**వారం రోజుల్లో బేషరతుగా క్షమాపణలు చెప్పాలి**

**లేనిపక్షంలో లీగల్ యాక్షన్ తప్పదని హెచ్చరిక**

టైమ్స్ ఆఫ్ వార్త – హైదరాబాద్ :

కేంద్ర మంత్రి, బీజేపీ ఎంపీ బండి సంజయ్ తనపై నిరాధారమైన, తన పరువుకు నష్టం కలిగేంచేలా వ్యాఖ్యలు చేశారంటూ కేటీఆర్ ఆయనకు లీగల్ నోటీసులు పంపారు. తనపై చేసిన నిరాధారమైన వ్యాఖ్యలకు వారం రోజుల్లోగా బేషరతుగా క్షమాపణలు చెప్పకపోతే పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు. ఈ నెల 19న బండి సంజరు మీడియాతో మాట్లాడుతూ తనపై తప్పుడు ఆరోపణలు చేశారని కేటీఆర్ నోటీసులో పేర్కొన్నారు. కేటీఆర్ డ్రగ్స్ తీసుకుంటాడనీ, బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డాడని బండి సంజరు ఆరోపణలు చేశారు. దీనిపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ బండి సంజయ్ చేసిన నిరాధారమైన కామెంట్లను నోటీసులో పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో తన తండ్రి కేసీఆర్ పేరు కూడా తీశారని చెప్పారు. బండి సంజరు చేసిన వ్యాఖ్యలు తన వ్యక్తిత్వాన్ని అవమానపరిచేలా, ప్రతిష్టను దిగజార్చేలా ఉన్నాయని నోటీసులో తెలిపారు. కేవలం తనను అప్రతిష్ట పాలు చేయాలన్న దురుద్దేశంతోనే బండి సంజయ్ ఇలాంటి వ్యాఖ్యలు చేశారన్నారు. తాను డ్రగ్స్ తీసుకుంటాననీ, ఫోన్ ట్యాపింగ్ చేశాననీ, కేసుల నుంచి తప్పించుకోవటానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో రహస్యంగా కలిసిపోయానంటూ బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను నిరూపించాలని కేటీఆర్ సవాల్ విసిరారు. ఎలాంటి ఆధారాలు లేకుండా ఇష్టానుసారంగా తన పరువుకు భంగం కలిగించే వ్యాఖ్యలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు విస్తృతంగా మీడియా, సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయబడ్డాయనీ, దీని కారణంగా ప్రజలు తనను తప్పుగా అర్థం చేసుకునే ప్రమాదం ఉందని కేటీఆర్ అన్నారు. ఫోన్ ట్యాపింగ్ సహా డ్రగ్స్ ఆరోపణలను కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. వాటన్నింటిని ఉద్దేశపూర్వకం గా కల్పించిన కట్టుకథలుగా కొట్టిపారేశారు. కేంద్రమంత్రిగా బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న బండి సంజయ్ లాంటి వ్యక్తి చేసే ఆరోపణలను ప్రజలు నమ్మే పరిస్థితి ఉంటుందన్నారు. ఎలాంటి ఆధారాల్లేకుండా కేవలం తనపై బురద చల్లాలన్న దురుద్దేశం, తమ పార్టీ రాజకీయ ఎజెండాను ముందుకు తీసుకెళ్లాలనే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని కేటీఆర్ నోటీసులో తెలిపారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా, తొమ్మిదేండ్లు రాష్ట్ర మంత్రిగా తెలంగాణ ప్రయోజనాల కోసం కృషి చేసిన తనను ఉద్దేశపూర్వకంగా బద్నాం చేసే కార్యక్రమం పెట్టుకున్నారని చెప్పారు. గతంలోనూ బండి సంజయ్ తనపై ఇలాంటి వ్యాఖ్యలే చేశారని గుర్తుచేశారు. రాజకీయంగా తనను ఎదుర్కొనే శక్తి లేకనే తన వ్యక్తిత్వంపై బురదచల్లే ప్రయత్నం గత కొన్ని సంవత్సరాలుగా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పదే పదే ఇలాంటి ఆరోపణలు చేయటం ద్వారా ప్రజల్లో తన ప్రతిష్టను నాశనం చేయాలనే కుట్ర తప్ప వారి ఆరోపణల్లో నిజం లేదని కొట్టిపారేశారు. బండి సంజయ్ తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని కేటీఆర్ నోటీసులో పేర్కొన్నారు.

జనరల్ న్యూస్
GENERAL NEWS

టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దినపత్రిక

గురువారం,
24-10-2024



## దేగాం పి.హెచ్.సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్



### ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

### అన్ని పీ.హీచ్.సీలలో పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని ఆదేశం

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ కలెక్టరేట్

ఆలూర్ మండలం దేగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివిధ విభాగాలను సందర్శించి పనితీరును పరిశీలించారు. ల్యాబోరేటరీ లో రక్త పరీక్షలు నిర్వహిస్తున్న విధానాన్ని గమనించి, టెక్నీషియన్ ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వ్యాధి నిర్ధారణ కోసం స్థానికంగానే యంత్రాలను వినియోగిస్తుండడాన్ని గమనించిన కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఇదే తరహాలో జిల్లా వ్యాప్తంగా అన్ని పీ. హెచ్.సీలలో పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తన వెంట ఉన్న జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీని ఆదేశించారు. మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల నిర్ధారణ కోసం రాపిడ్ టెస్ట్ కిట్లు అందుబాటులో ఉన్నాయా అని పీ. హెచ్.సీ వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రసూతి గది, ఓపి, ఇన్ పేషంట్ వార్డులను సందర్శించి రోగులకు అందిస్తున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. వాక్సిన్లను భద్రపరిచిన గదిని తనిఖీ చేసి, అవసరమైన ఔషధాలను శీతలీకరణలో ఉంచేందుకు ఫ్రిడ్జ్ లను వినియోగిస్తున్నారా లేదా అన్నది పరిశీలించారు. పాము కాటుకు గురైన వారికి వైద్య సేవలలో వినియోగించే యాంటీ వీనమ్ మెడిసిన్, అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించే ఆక్సిజన్ సిలిండర్లను ఎల్లవేళలా అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అన్నారు. కాగా, దేగాం ఆరోగ్య కేంద్రానికి సుమారు ఐదెకరాల సువిశాల విస్తీర్ణం కలిగిన ఆవరణ పచ్చదనంతో కూడి ఉన్నప్పటికీ, ఎక్కడికక్కడ పిచ్చి మొక్కలు, గడ్డి పెరిగిపోయి ఉండడాన్ని గమనించిన కలెక్టర్ ఒకింత అసహనం వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ఆరోగ్య కేంద్రాల పరిసరాలను శుభ్రం చేయించాలని అధికారులను ఆదేశించారు. మలేరియా, డెంగ్యూ, విష జ్వరాలు వంటి సీజనల్ వ్యాధులు తగ్గుముఖం పట్టినప్పటికీ, అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు.

# ఫీజు రీయింబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలి







### లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన

### ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి బానోత్ రఘురాం

### ధర్నా చౌక్ లో విద్యార్థులతో మహాధర్నా

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ

సుదీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ ను వెంటనే విడుదల చేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున విద్యార్థులతో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి భానోత్ రఘురాం అన్నారు. ఏఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా సమితి అధ్వర్యంలో పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని ధర్నా చౌక్ వద్ద విద్యార్థులతో మహాధర్న కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష సహాయ కార్యదర్శి బానోత్ రఘురాం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలు విడుదల చేయకపోవడంతో సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఇబ్బందులు పడుతున్నారన్నారు. సిబ్బందికి జీతాలు ఇవ్వలేక, భవన అద్దెలు చెల్లించలేక ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూన్నాయన్నారు. గత మూడు సంవత్సరాల నుంచి ఫీజుబకాయిలు విడుదల కాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక డిగ్రీ కళాశాల యాజమాన్యాలు రెండవ రోజు రాష్ట్రవ్యాప్తంగా ఆయా యూనివర్సిటీ పరిధిలో నిరవధికంగా డిగ్రీ కళాశాలలు బంద్ చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఇప్పటికీ స్పందించకుండా మౌనంగా ఉండడం సరికాదని, ఇప్పటికే అనేక సెలవులు రావడం వల్ల విద్యార్థులు విద్యా సంవత్సరంలో వెనుకబడ్డారని, మళ్లీ డిగ్రీ కళాశాలలు ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేసే వరకు నిరవధికంగా బంద్ చేస్తే విద్యార్థులకు తరగతుల నిర్వహణ, సెమిస్టర్ పరీక్షల నిర్వహణ ఆలస్యమయ్యే అవకాశం ఉంటుందన్నారు. దీనివల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కునే పరిస్థితి ఉందని, ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని కోరారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఫీజు బకాయిల విడుదల చేయడంలో నిర్లక్ష్యం చేస్తుందని మాట్లాడిన కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఫీజు బకాయిలు మొత్తం ఒకే సారి విడుదల చేస్తామని చెప్పిన ఆనాటి పీసీసీ అధ్యక్షుడు, నేడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి పది నెలలు కావస్తున్నా ఇప్పటికీ ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిల విడుదల చేయడంలో నిర్లక్ష్యం చేయడం సరికాదని అన్నారు. అనేక రకాల ఖర్చులు చేస్తూ అనేక చెల్లింపులు చేస్తు ప్రభుత్వం ఫీజు బకాయిలు విడుదల చేయడంలో చేస్తున్న నిర్లక్ష్యం సరికాదని, వెంటనే ప్రభుత్వం డిగ్రీ కళాశాల యాజమాన్యాలతో చర్చలు జరిపి వారికి రియంబర్స్మెంట్ విడుదల చేయడం పై హామీ ఇచ్చి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఫీజు బకాయిల విడుదల అయ్యే వరకు పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ మహాధర్నా కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా అధ్యక్షురాలు అంజలి, నగర సహాయ కార్యదర్శి నవీన్, కృష్ణ, నాయకులు టోకు, వంశీ, కుషాల్, కార్తీక్, గోదావరి, విద్యార్థులు పాల్గొన్నారు.

## జేసిఐ ఇందూర్ కు అవార్డుల పంట



టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ

హైదరాబాద్ లో జెసిఐ బంజారా ఆద్వర్యంలో జరిగిన "గోవిందం" జోన్కాన్ లో జెసిఐ ఇందూర్ అధ్యక్షుడు మనోజ్ కుమార్ నేతృత్వంలో నిర్వహించిన వివిధ సేవా కార్యక్రమాలకు గానూ అవార్డులు అందజేశారు. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సెల్ఫ్ డిఫెన్స్,జేసిఐ వారోత్సవాల నిర్వహణ, పబ్లిక్ రిలేషన్స్, కమ్యూనిటీ డెవలప్మెంట్, స్కిల్ డెవలప్మెంట్ శిక్షణలు, ఎడ్యుకేషన్ సపోర్ట్ కార్యక్రమాలకు పురస్కారాలు దక్కాయి. వ్యక్తిగత విభాగంలో ఉత్తమ మాజీ జోన్ ఉపాధ్యక్షునిగా జేసిఐ ఇందూర్ అధ్యక్షుడు విజయానంద్ కు అవార్డు దక్కింది. జోన్ అధ్యక్షుడు గోవింద్ కంకానీ, జోన్ డైరెక్టర్లు శ్రేయ దీక్షిత్, రుబిన మదానీ, గుండా నికేలు, జోన్ అధికారులు సుచిత్ర కతూరి, బంగార్రాజు, నర్రాపురం రాజు, గుంటి సంతోష్ జేసిఐ ఇందూర్ ప్రతినిధులకు అందజేశారు. జోన్ కోఆర్డినేటర్ నయన్, పూర్వ అధ్యక్షుడు విజయానంద్, లావణ్య, నిపున్ పాల్గొన్నారు. పురస్కారాలు రావడానికి సహకరించిన ప్రతిఒక్కరికి జేసిఐ ఇందూర్ అధ్యక్షులు మనోజ్ కుమార్ ధన్యవాదాలు తెలిపారు.

# గ్రంథాలయ చైర్మన్ గా అంతరెడ్డి రాజిరెడ్డి బాధ్యతల స్వీకరణ

### అభినందించి శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గా అంతరెడ్డి రాజిరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కేంద్రంలోని ఖలీల్వాడిలో గల జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముందుగా వేద పండితుల ఆశీర్వచనాల మధ్య ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే ప్రొద్దుటూరి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ విద్యతోపాటు విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయాలు దేవాలయాలతో సమానమని ఆయన అన్నారు. పోటీ పరీక్షల కోసం గ్రంథాలయాల్లో సన్నద్ధమవుతున్న అభ్యర్థులు ఎందరో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని, మరికొందరు వారి లక్ష్యానికి అనుగుణంగా తమను తాము సిద్ధం చేసుకుని అనుకున్న లక్ష్యానికి చేరారని ఆయన వివరించారు. గ్రంథాలయాల్లో నేటికీ ఎన్నో సమస్యలు ఉన్నాయని, గత ప్రభుత్వం గ్రంథాలయాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి ఉద్యోగార్దులకు ఉపయోగపడేలా తీర్చిదిద్దడంలో ఘోరంగా విఫలమైందని, గ్రంథాలయాల ప్రతిష్టను దెబ్బతీసిందని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రంథాలయాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారంపై దృష్టి కేంద్రీకరించామని, ఇప్పటికే చాలా సమస్యలను పరిష్కరించామని తెలిపారు. నిజామాబాద్ నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థకు గొప్ప పేరు ఉన్నదని దాన్ని కాపాడుకుంటూ సంస్థను మరింత అభివృద్ధి చెందేలా ప్రయత్నం చేయాల్సిన బాధ్యత నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చైర్మన్ రాజిరెడ్డి పై ఉందన్నారు. ఆయనకు తమ సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని అన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ... అందరి సహకారంతో జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ అభివృద్ధికి కృషి చేస్తానని గ్రంథాలయ చైర్మన్ అంత రెడ్డి రాజిరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి తో పాటు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తారాచంద్ నాయక్ తదితరులు పాల్గొని చైర్మన్ రాజిరెడ్డిని అభినందించారు.

## పాండు,చెక్కి చెరువుల్లో చేపపిల్లలు విడుదల

టైమ్స్ ఆఫ్ వార్త-బోధన్



బోధన్ పట్టణ శివారులోని పాండు చెరువు, చెక్కి చెరువుల్లో బుధవారం మత్స్యకార సంఘం పట ణ అధ్యక్షుడు కోట అబ్బయ్య ఆధ్వర్యంలో తహసీల్దార్ విఠల్,ఏవో సంతోష్ ల చేతుల మీదుగా చేప పిల్లలను విడుదల చేశారు. మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం విడుదల చేస్తున్న ఈ పథకంలో ఉచితంగా బంగారు తీగ, రాహు, బొచ్చే చేప పిల్లలను చెరువుల్లో వదిలారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విఠల్ మాట్లాడుతూ బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు బోధన్ పాండు చెరువు,చెక్కి చెరువుల్లో 51వేయి 8వందల 55 చేపపిల్లలు,మండలంలోని ఎరాజ్ పల్లి గ్రామంలో గల మూడు చెరువుల్లో లక్ష నాలుగువేలు,బర్దిపూర్ లోని రెండు చెరువుల్లో 19వేలు,పెగడపల్లి చెరువులో 22వేల చేపపిల్లలను మత్స్య కార్మికులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. మత్స్యకారులు చెరువులలో వదిలిన చేప పిల్లలకు ఏవైనా ఇబ్బందులు తలెత్తితే మత్స్యశాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ వరుణ్, మత్స్యశాఖ అధికారి ప్రవీణ్ ,పంచాయతీ కార్యదర్శులు, పెగడపల్లి రేష్మ,బార్దిపూర్ సద్ధునా,ఎరాజ్ పల్లి సతీష్, మత్స్యశాఖ డైరెక్టర్లు, సభ్యులు, పెద్దలు పాల్గొన్నారు.

# రెండు వారాల్లో ఎక్స్టర్నల్ ఉద్యోగ నియామక ప్రక్రియ పూర్తి చేయాలి

### త్వరలోనే అభ్యర్థులకు నియామక పత్రాల అందజేత

### రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు భర్తీ ప్రక్రియ మరింత వేగవంతం

### భూగర్భ గనుల్లో పనిచేసే సీనియర్ కార్మికులకు పదోన్నతులో న్యాయం జరిగేలా చర్యలు

### సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్




టైమ్స్ ఆఫ్ వార్త-మంచిర్యాల జిల్లా ప్రతినిధి

సింగరేణిలోని వివిధ ఖాళీలకు నిర్వహించిన ఉద్యోగ నియామక పరీక్షలకు సంబంధించి 599 పోస్టుల నియామక ప్రక్రియను రెండు వారాల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. 272 పోస్టులకు అక్టోబర్ 24 నుంచి సర్టిఫికేట్ వెరిఫికేషన్ మొదలవుతున్న నేపథ్యంలో బుధవారం ఆయన అధికారులతో హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కీలక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, వీలైనంత త్వరగా పారదర్శకంగా సర్టిఫికేట్ వెరిఫికేషన్, మెడికల్ పరీక్షలు పూర్తి చేసి, అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా 300 మంది కారుణ్య నియామక అభ్యర్థులకు సైతం నియామక పత్రాలు అందజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఏడాది ఎక్స్టర్నల్ పద్ధతిలో నిర్దేశించుకున్న 599 పోస్టులను తొలిసారిగా ఆన్లైన్ పద్ధతిలో అత్యంత పకడ్బందీగా పరీక్షలు నిర్వహించామని, అదేవిధంగా సర్టిఫికేట్ వెరిఫికేషన్ ను సైతం పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఇంటర్నల్ రిక్రూట్మెంట్ లో ఖాళీలను గుర్తించి, నియామకాలను చేపట్టాలన్నారు. కంపెనీలో పెద్ద సంఖ్యలో మహిళా ఉద్యోగులు చేరుతున్న నేపథ్యంలో వారి సేవలను గనుల్లో సమర్థవంతంగా వినియోగించుకునేందుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. అదే సమయంలో కారుణ్య నియామకంతో ఉద్యోగాల్లో చేరే వారిని భూగర్భ గనుల్లో విధులు నిర్వహించేందుకు విధి విధానాలను త్వరగా తయారు చేయాలని స్పష్టం చేశారు. కంపెనీలో మానవ వనరులను సమర్థంగా వినియోగించుకోవడంతో ఉత్పాదకతను పెంచడానికి అవకాశం ఉంటుందని, ఈ దిశగా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. సుదీర్ఘ కాలంగా భూగర్భ గనుల్లో పని చేస్తున్న సీనియర్ కార్మికులకు పదోన్నతుల్లో ఇబ్బందులు లేకుండా చూడాలని, అదే సమయంలో కొన్ని ఏరియాల్లో ఖాళీలు లేకపోవడం వల్ల కొన్ని విభాగాల్లో కార్మికులకు పదోన్నతులు దక్కని విషయంపై అధ్యయనం చేసి, నివేదిక సమర్పించాలని సూచించారు. నూతనంగా ఉద్యోగాల్లో చేరిన కార్మికులు గైర్హాజరు కాకుండా చూసేందుకు అన్ని ఏరియాల్లోనూ కౌన్సిలింగ్ ప్రక్రియను మళ్లీ ప్రారంభించాలన్నారు.ఈకార్యక్రమంలో సింగరేణి భవన్ నుంచి కో ఆర్డినే జీఎం ఎస్డిఎం సుభానీ, ఐఆర్, పీఎం జీఎం కవితా నాయుడు, కొత్తగూడెం నుంచి వెల్ఫేర్, ఆర్సి జీఎం శామ్యూల్ సుధాకర్, ఎంఎస్ జీఎం సురేశ్ బాబు లు పాల్గొన్నారు.

# ఆరోగ్యం పట్ల ఏమాత్రం అశ్రద్ధ పనికిరాదు

### ప్రముఖ స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ అంకం భానుప్రియ

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ



ఆరోగ్యం విషయంలో ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఈ విషయంలో నిర్లక్ష్యం ఏమాత్రం పనికిరాదని ప్రముఖ స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ అంకం భానుప్రియ సూచించారు. నిజామాబాదు నగరంలోని పాలిటెక్నిక్ కళాశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ ఆద్వర్యంలో ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ అంకం భానుప్రియ ముఖ్య ప్రవక్తగా హాజరై విద్యార్థినిలను ఉద్దేశించి మాట్లాడుతూ.. ఆరోగ్యం పట్ల అశ్రద్ధ పనికిరాదన్నారు. అనారోగ్యం కలిగితే సొంత వైద్యం చేసుకోకుండా డాక్టర్ ను సంప్రదించాలన్నారు. మహిళలను రక్తహీనత సమస్య వేదిస్తుందని పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఈ సమస్యను పరిష్కరించవచ్చని సూచించారు. క్యాన్సర్ పట్ల అవగాహన కలిగి ఉండాలని ఆమె పేర్కొన్నారు. అనంతరం విద్యార్థినిల సందేహాలకు డాక్టర్ భానుప్రియ నివృత్తి చేశారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బి. నరేష్, లయన్స్ జోన్ చైర్మెన్ జిల్కర్ విజయానంద్, ఉపాధ్యక్షులు పొలాస సత్యనారాయణ, కార్యదర్శి రవీంద్రనాథ్ గుప్త, కోశాధికారి రాఘవేంద్ర బాబు, పూర్వాధ్యక్షులు గంగాదాస్, పాలిటెక్నిక్ కళాశాల అలుమ్ని అధ్యక్షుడు బాల్ భారతి పాల్గొన్నారు.

## పలు గ్రామాలలో పశువులకు టీకాలు

టైమ్స్ ఆఫ్ వార్త -మాక్లూర్



పలు గ్రామాలలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. పశువైద్య మరియు పశువర్ధక శాఖ ఆధ్వర్యంలో, గాలిబ్ నగర్,గద్వాల క్యాంప్, బోర్గం(కె)గ్రామాలలో,మండల పశువైద్యకారులు డాక్టర్ కిరణ్ దేశ్ పాండే,మరియు ఉమమాసాహెర్ లు, 476 పశువులకు, ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న గాలికుంటూ నివారణ టీకాలు బుధవారం వేశారు. ఈ సందర్భముగా పశులుకలిగిన రైతులకు, ఈ టీకాలపై అవగాహనకల్పించి, పలు సూచనలు చేశారు. కార్యక్రమములో వీరితోపాటు హమ్మద్ పాషా వి ఏ,టి.వినిత వియల్ఒ,ఆర్.కల్యాణి టీవీఓ.ఆఫీస్ సబార్డెన్స్ గంగాధర్,శ్యామల,మహేశ్వరీ, పుష్ప,గొపాలమిత్ర బేగ్, సుదీర్, సలీమ్,పాడికిలిగిన రైతరులు పాల్గొన్నారు.

జనరల్ న్యూస్
GENERAL NEWS
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దినపత్రిక
గురువారం, 24-10-2024
3

# రైతు శ్రేయస్సు కోసం పాటుపడినప్పుడే సహకార సంఘాల లక్ష్యం నెరవేరినట్టు





### నిజాం షుగర్ ఫ్యాక్టరీని త్వరలో తెరిపిస్తాం

### వ్యాధుల సోకిన పంటల నివారణ పై రైతులకు సూచనలు చేయాలి

### ధాన్యం కొనుగోలు విషయంలో ప్రతి సొసైటీ బాధ్యతగా వ్యవహరించాలి

### 17% తేమ శాతం ఉన్న వడ్లను తీసుకోవాలి

### అవగాహన సదస్సులో మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

### హాజరైన రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ జిల్లా ప్రతినిధి

రైతు శ్రేయస్సు కోసం పాటుపడినప్పుడే సహకార సంఘాల లక్ష్యం నెరవేరినట్టు అవుతుందని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే ప్రొద్దుటూరి సుదర్శన్ రెడ్డి అన్నారు.

నిజామాబాద్ జిల్లా డిసిసిబి ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి అధ్యక్షతన ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిఎసిఎస్ అధ్యక్ష కార్యదర్శులకు ఒక రోజు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిలుగా మాజీ మంత్రి బోధన్ నియోజకవర్గ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతి రెడ్డి హాజరయ్యా. ఈ సందర్భంగా బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ సహకార సంఘాలు అభివృద్ధి చెందాలంటే అధికారులకు, పాలకవర్గాలకు మధ్య సంబంధం దగ్గరగా ఉండాలని, అందరూ కలిసి పనిచేసి సంస్థను అభివృద్ధి వైపునాకు నడిపించాలని సూచించారు. సహకార సంఘాలు అంటే కేవలం వరి కొనుగోలు చేసి ఎరువులు అమ్మి కొనసాగించడం మాత్రమే కాదు అని, కేవలం వరి కొనుగోలు ద్వారానే సంస్థల మనుగడ కొనసాగదని ఆయన అన్నారు. సహకార సంఘాలలో ప్రతిపత్తి కాకుండా కమర్షియల్ వ్యాపారాలు చేసి సంస్థల భవిష్యత్తును బలంగా చేయాలని ఆయన అన్నారు. అదేవిధంగా రైతులకు ముఖ్యమైన సూచనలు ఎలాంటి విత్తనాలు వాడాలి, ఎంత మోతాదు ఎరువు వాడాలి, పొలంకు వచ్చిన రోగాలకు సంబంధించిన నివారణ చర్యలను కూడా శాస్త్రవేత్తలు, అధికారులు రైతులకు తెలియజేయాల్సిన బాధ్యత వారి పైన ఉందన్నారు. అదేవిధంగా పంటలలో వరి మాత్రమే కాకుండా చెరుకు వంటివి కూడా సాగు చేసే విధంగా ప్రోత్సహించాలని ఆయన అన్నారు. వడ్ల కొనుగోలు విషయంలో ప్రతి సొసైటీలో బాధ్యతగా వ్యవహరించాలని, 17 పర్సెంట్ తేమ శాతం వచ్చిన వడ్లను తీసుకోవాలని, తడిగా ఉన్న ధాన్యాన్ని వాతావరణాన్ని బట్టి ఒకరోజు ఎండబెట్టి తీసుకోవాలని, రైతులకు కూడా వాతావరణానికి అనుగుణంగా పంట పొలాలు కోతలు నిర్వహించాలని ఆయన సూచించారు. ప్రభుత్వం త్వరలోనే కొనుగోలు మొదలు పెడుతుందని ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ గోదాములు అన్ని నిండిపోయాయని, ఇప్పుడు కొనుగోలు చేసిన వడ్లను నిలువ చేయడానికి గోదాంలు సమకూర్చిన తర్వాత ప్రభుత్వం వడ్లు కొనుగోలు చేస్తుందని ఆయన అన్నారు. అదేవిధంగా బోధన్ షుగర్ ఫ్యాక్టరీని త్వరలోనే తెరిపిస్తామని, దాదాపు 200 కోట్ల వరకు బకాయిలను చెల్లించడం జరిగిందని, రైతులు చెరుకు వైపు కూడా మొగ్గు చూపాలని, చెరుకులో ఏ రకమైన విత్తనం వేస్తే ఏ విధంగా వస్తుందో శాస్త్రవేత్తలు వారికి సూచనలు తెలపాలని, అధికారులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని సుదర్శన్ రెడ్డి అన్నారు.

### ఇతర వ్యాపారాలతో సొసైటీకి లాభదాయకం.. ఎమ్మెల్యే భూపతి రెడ్డి

రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి మాట్లాడుతూ సహకార సంఘాలు అభివృద్ధి జరగాలంటే కేవలం వరి కొనుగోలు మాత్రమే కాకుండా ఇతర వ్యాపారాలు కూడా చేయాలని, చేపల పెంపకం కోళ్ల పెంపకం, పూల విక్రయం, పాల విక్రయం వంటి వాటిలో సొసైటీలు పాల్గొని కొనుగోలు విక్రయాలు చేస్తే సొసైటీలకు లాభదాయకంగా ఉంటుందని ఆయన అన్నారు. రైతుల నుంచి వ్యాపారులు పాలు కొనుగోలు చేసి అధిక శాతం నీళ్లు కలిపి ప్రజలకు అందిస్తున్నారని, అలా కాకుండా రైతుల నుంచి సొసైటీలు పాలు సేకరించి ప్రజలకు అందించడం ద్వారా సొసైటీలకు కూడా లాభంగా ఉంటుందని, అదేవిధంగా చేపలు పెంచడంలో గాని కోళ్లు పెంచడంలో గాని సొసైటీలు తమ వంతుగా వరి కొనుగోలు చేసిన విధంగా వాటిని కూడా కొనుగోలు చేసి సప్లయర్ గా ఉండడం ద్వారా సొసైటీలకు లాభాలు చేకూరుతాయని, తద్వారా సొసైటీలు బాగుపడతాయని, భవిష్యత్తులో కూడా ఇబ్బందులు రాకుండా ఉంటాయని ఆయన తెలిపారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం కావాలన్నా ముందుండి సహకరిస్తానని ఆయన అన్నారు.

### పాలకవర్గాల మధ్య సంబంధాలు దగ్గరగా ఉంటేనే అభివృద్ధి.. చైర్మన్ మానాల మోహన్ రెడ్డి

రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి మాట్లాడుతూ సంస్థలు అభివృద్ధి చెందాలంటే అధికారులకు పాలకవర్గాలకు మధ్య సంబంధాలు దగ్గరగా ఉండాలని ఎక్కడో జరిగే కొన్ని చిన్న చిన్న తప్పుల వల్ల సహకార సంఘాల విలువలు తగ్గిపోతున్నాయని, కానీ నిజానికి సహకార రంగాల పాత్ర ఎంతో కీలకమైనదని ఆయన అన్నారు. అదేవిధంగా సహకార సంఘాలు ఆర్థికంగా బలంగా కావాలంటే కేవలం వరి కొనుగోలుపై ఆధార పడకుండా ఇతర వ్యాపారాలు చేసి సంస్థను లాభాదాయకంగా చేయొచ్చని, కావున కామన్ సర్వీస్ సెంటర్లు ప్రతి సొసైటీలో ఏర్పాటు చేసి ప్రజలకు సేవలు అందిస్తూనే సంస్థకు ఆర్థిక లాభం సమకూర్చే ప్రయత్నాలు చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. అందులో భాగంగా నవంబర్ 30వ తేదీన హైదరాబాద్, వరంగల్ శిక్షణ కేంద్రాలలో సొసైటీ కంప్యూటర్ ఆపరేటర్లకు కామన్ సర్వీసింగ్ సెంటర్ పై ట్రైనింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. దీనికి ప్రతి సొసైటీ నుంచి కంప్యూటర్ ఆపరేటర్లను ఆయా సొసైటీ అధ్యక్షులు విధిగా పంపించాలని, అందరం కలిసి సహకార రంగాన్ని అభివృద్ధి చేసే దిశగా ముందుకు వెళ్దామని మానాల మోహన్ రెడ్డి తెలిపారు. సి ఎస్ సి ద్వారా సేవలు అందించడం ద్వారా సొసైటీలు ఆర్థికంగా లబపడటమే కాకుండా సొసైటీ పరిధిలోని వారికి సేవలు అందించే విధంగా ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ రమేష్ రెడ్డి, డిసిఎంఎస్ చైర్మన్ తారాచంద్, మార్క్ఫెడ్ చైర్మన్ మర గంగారెడ్డి, వ్యవసాయ కమిషన్ మేంబర్ గడుగు గంగాధర్, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ ఎండి అన్నపూర్ణమ్మ, డిసిసిబి డైరెక్టర్లు, డిసిఎంఎస్ డైరెక్టర్లు, వివిధ సొసైటీల అధ్యక్ష కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు

# మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికుల వేతనం రూ. 26 వేలు అమలు చేయాలి






### బహుజన మున్సిపల్ వర్కర్స్, బిఎల్ టీయూ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ

మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మిక, ఉద్యోగులకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని, మృతి చెందిన కార్మిక ఉద్యోగి కుటుంబానికి 50 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని బహుజన మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ బిఎల్ టియు రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ డిమాండ్ చేశారు. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ముందు జరిగిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ వాటర్ సప్లై, స్ట్రీట్ లైట్స్, ఫిల్టర్ బెడ్స్, గార్డెన్స్, శానిటేషన్ డ్రైవర్స్, శానిటేషన్ కార్మికులు, జవాన్లు తదితర సెక్షన్ల ఔట్ సోర్సింగ్ కార్మిక ఉద్యోగులు శ్రమ దోపిడికి గురవుతున్నారని దండి వెంకట్ ఆరోపించారు. మున్సిపల్ ఔట్ సోర్సింగ్ రంగంలో అత్యంత శ్రమ దోపిడికి గురవుతున్న బహుజన కార్మికులకు కనీస వేతనం 26 వేలు అమలు చేయాలని, విధి నిర్వహణలో మృతి చెందిన ఔట్ సోర్సింగ్ కార్మిక ఉద్యోగులకు యాబై లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆర్థికంగా అత్యంత వెనుకబాటుకు గురైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు చెందిన వారు కావడం వల్లే ఔట్ సోర్సింగ్ కార్మిక, ఉద్యోగులపై వివక్ష కొనసాగుతుందని దండి వెంకట్ అన్నారు. అనంతరం అసిస్టెంట్ కమిషనర్ శంకర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బహుజన మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షురాలు సబ్బని లత, ప్రధాన కార్యదర్శి మేకల రాజేందర్, వాటర్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కొమ్ము రాహుల్, కార్యదర్శులు అయిబూటి హరిష్ , బిఎల్ టీయూ జిల్లా నాయకులు, డ్రైవర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శి పి. నవీన్, ఎం. ఎల్లయ్య, నాయకులు మోహన్ గౌడ్, ఆర్, మురళి, శ్రీశైలం, ఆర్. రాజేశ్వర్, శ్రామిక మహిళా సంఘం నాయకురాలు వేల్పూర్ నీలా, కృష్ణ, ప్రశాంత్, మధు, మున్సిపల్ కార్పొరేషన్ లో విధులు నిర్వహిస్తున్న అన్ని సెక్షన్లకు చెందిన వందమంది కార్మికులు పాల్గొన్నారు.

## రెచ్చిపోతున్న శునకాలు..గాయాలపాలవుతున్న జనాలు..





### కుక్కల దాడిలో పలువురికి తీవ్రగాయాలు

టైమ్స్ ఆఫ్ వార్త - ఎడపల్లి

వీధి కుక్కల దాడిలో రోజుకు ఎక్కడో ఓచోట ఎవరో ఒకరు బలవుతూ తీవ్రంగా గాయాల పాలవుతున్నారు. గ్రామాల్లో,పట్టణాల్లో అనే తేడా లేకుండా వీధి కుక్కలు జనాలపై దాడులకు పాల్పడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి.తాజాగా ఎడపల్లి మండల కేంద్రంలో మంగళవారం రాత్రి వరికల్లాల వద్దకు వెళుతుండగా సంతోష్ అనే వ్యక్తిపై విచక్షణ రహితంగా వీధి కుక్క దాడి చేయడంతో సంతోష్ కి తీవ్ర గాయాలు అయ్యాయి.తీవ్రంగా రక్తస్రావం అవుతుండడం గమనించిన స్థానికులు,కుటుంబీకులు హుటాహుటిన లక్ష్మణ్ ని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.అంతే కాకుండా ఓ గేదె దూడని సైతం కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయాల పాలు చేయడంతో దూడ మృతిచెందింది. వరికోత మిషన్ ఆపరేటర్ ను, కాలనీలో సైకిల్ పై వెళుతున్న మరో వ్యక్తిని కాటు వేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. గత కొన్ని నెలలుగా కుక్కల సైర్య విహారం చేస్తున్నాయని పట్టించుకోవడం లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. బుధవారం సైతం కుక్కల దాడిలో బాపూనగర్ గ్రామానికి చెందిన కొయ్యల ఎల్లయ్య తీవ్ర గాయాలపాలై ఆసుపత్రికి తరలించాల్సిన పరిస్థితి నెలకొందని, గ్రామాల్లో పాలన వ్యవస్థ అనేది అస్తవ్యస్తంగా తయారైందని ఈకుక్కల దాడుల విషయం పలుమార్లు పంచాయతీ అధికారులకు, ప్రజాప్రతినిధుల వద్దకు ప్రస్తావనకు తీసుకువెళ్లినా ఎలాంటి చర్యలు లేవని దీని మూలంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. గ్రామ పంచాయతీ అధికారులు వివిధ కారణాలు చెబుతూ తప్పించుకుంటున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అయితే కుక్కల బెడద ఈ ఒక్క గ్రామనిదే కాదని మండలంలోని ఆయా గ్రామాల్లో నెలకొందని మండల ప్రజలు పేర్కొంటున్నారు.ఇకనైనా జిల్లా, మండలస్థాయి అధికారులు స్పందించి కుక్కల బెడదకు ఓ పరిష్కారం చేయాలని గ్రామస్తులను కుక్కల దాడుల నుండి కాపాడాలని కోరుతున్నారు.

## ఫిజియోథెరపీ వైద్య శిబిరం

టైమ్స్ ఆఫ్ వార్త-చింతకాని



చింతకాని మండల పరిధిలోని ప్రత్యేక అవసరాలు గల వివిధ రకముల శారీరక వై కల్యములు, పాక్షిక పక్షవాతం (సెరిబ్రల్ పాల్సి) వంటి సమస్యలతో బాధపడుతున్న చిన్నారులకు లచ్చగూడెం హై స్కూల్ ఆవరణలో ఉన్న దివ్యాంగ బాల బాలికల భవిత కేంద్రంలో ఉచిత ఫిజియోథెరపీ వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. దీనికి గాను మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి శారీరక వైకల్యములతో బాధపడుతున్నబాలబాలికలు వారి తల్లిదండ్రులతో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఫిజియోథెరపీ డాక్టర్ జి వసంత, అంగన్వాడి టీచర్ గూని రమాదేవి ,భవితా కేంద్రం నిర్వాహకులు కేఎస్ కృష్ణారావు ఐఆర్పి, భూక్యాదస్లి ఐఆర్పి పాల్గొన్నారు.

# చట్టాలపై అవగాహనతో బలమైన పారిశ్రామిక సంబంధాలు

### సింగరేణి గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులకు శిక్షణ, అవగాహన తరగతులు

### హైదరాబాద్ ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా ఫ్యాకల్టీలతో 4రోజులు తరగతులు

### సింగరేణి వ్యాప్తంగా పాల్గొంటున్న 30 మంది నాయకులు

టైమ్స్ ఆఫ్ వార్త-మంచిర్యాల జిల్లా ప్రతినిధి



పారిశ్రామిక చట్టాల పైన, పనిచేస్తున్న పరిశ్రమ పైన కార్మిక సంఘాలకు పూర్తి అవగాహన ఉంటే మంచి పారిశ్రామిక సంబంధాలు కొనసాగుతాయని, ఇవి కంపెనీని నిర్మాణాత్మకంగా ముందుకు నడిపించడంలో ఎంతగానో దోహదపడతాయని సింగరేణి కో ఆర్డినేషన్ జనరల్ మేనేజర్, చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ అధికారి ఎస్డిఎం సుభాని తెలిపారు. హైదరాబాద్ లోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో సింగరేణి గుర్తింపు, ప్రాతినిధ్య కార్మిక సంఘాల ప్రతినిధులకు ఏర్పాటుచేసిన ప్రత్యేక శిక్షణ, అవగాహన శిబిరం ప్రారంభోత్సవ సభలో ఆయన ప్రసంగించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, 135 సంవత్సరాల సింగరేణి చరిత్రలో, ఎదుగుదలలో సింగరేణి కార్మిక సంఘాల పాత్ర మరువలేనిదని తెలిపారు. చట్టాల పైన, వివిధ రకాల పాలసీల పైన కార్మిక నాయకులకు అవగాహన ఉంటే వివిధ సమస్యలపై యాజమాన్యంతో సంప్రదించే సమయంలో అది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. కార్మిక సంఘాలు, యాజమాన్యం బలంగా ఉన్నప్పుడే సంస్థ మరింత పటిష్టంగా ముందుకు వెళ్లగలుగుతుందని అభిప్రాయపడ్డారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో గుర్తింపు కార్మిక సంఘమైన ఏఐటియుసి ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్ మాట్లాడుతూ, అనేక మంది కార్మికుల ప్రాణత్యాగం ఫలితంగా సింగరేణి దశాబ్దాల కాలంగా దేశానికి సేవలందిస్తూ ఈ స్థాయికి ఎదిగిందన్నారు. కార్మిక సంఘాలకు సముచిత ప్రాధాన్యత కల్పిస్తూ, సమైక్యంగా ముందుకుపోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. వివిధ రకాల చట్టాలపై అవగాహన కలిగించడానికి యాజమాన్యం ఇటువంటి శిక్షణా తరగతులు ఏర్పాటు చేయటం సంతోషకరమన్నారు. ప్రాతినిధ్య కార్మిక సంఘమైన ఐఎన్టియుసి సెక్రటరీ జనరల్, రాష్ట్ర కనీస వేతనాల అమలు కమిటీ చైర్మన్ బి జనక్ ప్రసాద్ మాట్లాడుతూ, సింగరేణి అభివృద్ధిలో కార్మిక సంఘాలను పరిగణనలోకి తీసుకొని, ప్రోత్సహిస్తే పారిశ్రామిక సంబంధాలు మరింత బలపడతాయన్నారు. సింగరేణి ప్రగతి పథంలో పురోగమించాలంటే కార్మిక సంఘాలు, యాజమాన్యం ఎటువంటి విభేదాలు లేకుండా కలిసి పనిచేయాల్సి ఉంటుందని, ఈ తరహా శిక్షణ తరగతులు యువ నాయకులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. సింగరేణి పర్సనల్ జనరల్ మేనేజర్, పారిశ్రామిక సంబంధాలు కవిత నాయుడు మాట్లాడుతూ, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల ఎన్నికల తర్వాత, గత సెప్టెంబర్ 9న సంఘాలకు ధ్రువీకరణ పత్రాలను అందజేయడం జరిగిందని, కార్మిక సంఘాల నాయకులకు ఈ తరహా శిక్షణ కార్యక్రమాలు మంచి విజ్ఞానాన్ని అందిస్తాయని, కార్మిక శ్రేయస్సు, కంపెనీ అభివృద్ధి దృష్ట్యా ఇవి ఎంతో ప్రాధాన్యతను కలిగి ఉన్నాయన్నారు. ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ డైరెక్టర్ రామేశ్వరరావు మాట్లాడుతూ, సింగరేణి అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, దీనికి కార్మిక సంఘాల తోడ్పాటు సైతం ఎంతో అవసరమన్నారు. కార్మిక నాయకులకు అన్ని విషయాల పైన సమగ్ర అవగాహన కలిగించడం కోసమే ఈ తరగతులు నిర్వహిస్తున్నారని, ఇవి నిత్యజీవితంలో సవాళ్లను ఎదుర్కోవడానికి కూడా ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి మధ్యాహ్నం ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య హాజరయ్యారు. సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాల నుండి గుర్తింపు, ప్రాతినిధ్య కార్మిక సంఘాలకు చెందిన మొత్తం 30 మంది ప్రతినిధులు ఈ శిక్షణ శిబిరంలో పాల్గొంటున్నారు. సింగరేణి అభివృద్ధిలో కార్మిక సంఘాల పాత్ర, జెబిసిసిఐ, సింగరేణి చట్టాలపై అవగాహన, వివిధ రకాల లేబర్ పాలసీలు, అనుభవాలు, రక్షణ చర్యల్లో కార్మిక సంఘాల చొరవ వంటి అనేక విషయాలపై నాలుగు రోజులపాటు ఈ శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాతో పాటు పలు ప్రముఖ కళాశాలలకు చెందిన ప్రొఫెసర్లు, మైనింగ్ మేధావులు పై అంశాల పైన ప్రత్యేక అవగాహన తరగతులు తీసుకోబోతున్నారు. ఈకార్యక్రమంలో ఐఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి సి త్యాగరాజన్, కోర్సు డైరెక్టర్ కెజె అమర్నాథ్, సింగరేణి ఏజీఎం లక్ష్మినారాయణ, డీజీఎం లు అజయ్ కుమార్, రాజగోపాల్ లు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి పోటీలకు క్యూరీయస్ టైక్వాండో అకాడమీ క్రీడాకారులు

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ స్పోర్ట్స్



తెలంగాణ రాష్ట్ర స్థాయి అంతర్ పాఠశాలల టైక్వాండో పోటీలకు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని క్యూరియస్ టైక్వాండో అకాడమీకి చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు మాస్టర్ వినోద్ తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల్లో భాగంగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని స్విమ్మింగ్ పూల్ ప్రాంగణంలో అండర్ 14, 17 బాల బాలికల విభాగాల్లో తైక్వాండో క్రీడాకారుల కోసం ఎంపి కలు నిర్వహించారు. ఈ ఎంపికల్లో కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల నుంచి 150 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో క్యూరియస్ తైక్వాండో అకాడమీకి చెందిన 11 మంది క్రీడాకారులు గోల్డ్ మెడల్స్ సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వినోద్ తెలిపారు. అండర్ 17 బాలుర విభాగంలో హర్ష్ పాండ్రే, శౌర్య శ్రీవాస్తవ, ఉదిత్ సాయి, యశస్వి, అజాన్ ఖాన్ ఎంపిక కాగా బాలికల విభాగంలో అశ్మిత, దుర్గాశ్రీ ఎంపికైన వారిలో ఉన్నారు. అదేవిధంగా అండర్ 14 కేటగిరీ నుంచి 4గురు క్రీడాకారులు ఎంపికయ్యారన్నారు. ఈ 7 గురు క్రీడాకారులు అక్టోబర్ 23 నుంచి 25 వరకు గద్వాలలో జరిగే రాష్ట్ర ఎస్జీఎఫ్ ఛాంపియన్షిప్లో జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఎంపికలకు ఫిజికల్ డైరెక్టర్ ఈశ్వర్ నిర్ణేతగా వ్యవహరించారు.

జనరల్ న్యూస్
GENERAL NEWS
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దినపత్రిక
గురువారం,
24-10-2024


## చిన్నారి వైద్యం కోసం స్పందించిన మీకోసం మేము సేవా సంస్థ



టైమ్స్ ఆఫ్ వార్త - ఎడపల్లి

ఎడపల్లి మండలం ఏఆర్పీక్యాంప్ గ్రామానికి చెందిన వినోద్ కుమార్ రజిత దంపతుల సంతానం పాపగోని సుమనస వందిని అనే 7సంవత్సరాల చిన్నారి అరుదైన బోన్ మారో వ్యాధితో బాధపడుతున్నదని, చికిత్స కోసం ఆర్థిక సహాయం చేయాలని టైమ్స్ ఆఫ్ వార్త దినపత్రికలో వచ్చిన శీర్షికకు దాతలు స్పందించారు. ఈమేరకు మీకోసం మేము సేవా సంస్థ స్పందించి ముందుకువచ్చి సుమనస వందిని చిన్నారి వైద్య ఖర్చుల కోసం రూ.10వేల ఆర్థిక సహాయంను చిన్నారి తల్లిదండ్రులకు అందించారు. ఆర్థిక సహాయం అందించిన సంస్థ వ్యవస్థాపకులు రఘుపతి లక్ష్మయ్య, సభ్యులు గంగాధర్, పోతాజీ, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## మూసి ప్రక్షాళన పేరుతో పేద ప్రజల జీవితాలతో చెలగటం







**దీనిని భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండిస్తుంది**

**గత ప్రభుత్వం కాలేశ్వరం పేరుతో దోచుకుంటే.. ఈ ప్రభుత్వం మూసి కుంభకోణానికి తెరలేపింది**

**ఇళ్ళు కూల్చేస్తామంటే పేద ప్రజల పక్షాన జెసిబికి అడ్డుగా నిలబడతాం**

**మూసి ప్రక్షాళనకు మేము వ్యతిరేకం కాదు.. ముందు మురుగునీటి శుద్ధికరణ చేయండి**

**నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా**

**మూసి పరివాహ ప్రాంతంలో పర్యటించిన ఎమ్మెల్యే ధన్పాల్**

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ జిల్లా ప్రతినిధి

హైదరాబాదులోని మూసీ పరివాక ప్రాంతం బహదూర్ పుర కిషన్ బాగ్ డివిజన్లో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, బిజెపి నాంపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి రాహుల్ చంద్ర, స్థానిక నాయకులతో కలిసి నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా పర్యటించారు. ఈ పర్యటనలో మూసి బాధితుల సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మూసి ప్రక్షాళన పేరు మీద అమాయక ప్రజల జీవితాలతో చాలగటం ఆడుతుందని దీన్ని భారతీయ జనతా పార్టీ పూర్తిగా ఖండిస్తుందన్నారు. గత ప్రభుత్వం కాళేశ్వరం పేరు మీద వందల కోట్లు వెనకేసుకుంటే, ఈ కాంగ్రెస్ ప్రభుత్వం మూసి పేరు మీద పెద్ద కుంబకోణనికి తేర లేపిందన్నారు. ఏళ్ల తరబడి ఇక్కడే నివసిస్తున్న ఈ ప్రాంత ప్రజలను ఎఫ్ టి ఎల్, బఫర్ జోన్, ఆర్ బి ఎక్స్, ఇంకో పేరుతో పేదలకు నిలువ నీడ లేకుండా చేసే ప్రయత్నం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని ఆయన ఆరోపించారు. పైసా పైసా కూడపెట్టుకొని రెక్కలు ముక్కలు చేసుకొని నిర్మించుకున్న ఇళ్లను కూల్చి, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇస్తాం అనడం దుర్మార్గం అన్నారు. డబుల్ బెడ్ రూమ్, వీళ్ళు కట్టుకున్న ఇళ్ళు సమానమా అని అడుగుతున్నాను అన్నారు. కాంగ్రెస్ నాయకులవి, ఎంఐఎం ఆస్తులు కూల్చే దమ్ము రేవంత్ నీకు ఉందా%ా%? పేదోని ఇళ్ళు కూల్చాడానికి మాత్రం కనీసం నోటీసులు కూడా ఇచ్చే పరిస్థితి లేదన్నారు. ఈ ప్రాంత ప్రజల ఇళ్ళు పక్కా రిజిస్ట్రేషన్, కరెంటు మీటర్ అన్ని ఉన్న అమాయక ప్రజల ఇళ్ళు కులాగోడతాం అంటే మేము చూస్తూ ఊరుకోమన్నారు. ఖచ్చితంగా భారతీయ జనతా పార్టీ ప్రజల పక్షాన నిలపడుతదని జెసిబి లకు అడ్డంగా మేము ఉంటాం, మమ్మల్ని కూల్చిన తరువాతే పేదల ఇళ్ళ జోలికి పోవాలని ఈ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాం అన్నారు. మూసి ప్రక్షాళనకు మేము వ్యతిరేకం కాదు, ప్రక్షాళనకు ముందు మురుగు నీటి శుద్ధికరణ చేయండి, చేతనైతే మురుగు నీరు కలవకుండా చర్యలు తీసుకోండి, రిటైనింగ్ వాల్ ఏర్పాటు చేసి ప్రయత్నం చేయండి అన్నారు. ఇవేవి చేతకాని కాంగ్రెస్ పార్టీ పదేళ్లు అధికారం లేక ఇప్పుడు అధికారంలోకి రాగానే ఎలా దోచుకోవాలనే ఆలోచనలో పడి మూసి ప్రక్షాళన పేరుతో అమాయక ప్రజల జీవితాలతో ఆడుకుంట అంటే చూస్తూ ఊరుకోము అని హెచ్చరిస్తున్నాను

# క్రీడలు శారీరక, మానసిక వికాసానికి దోహదం చేస్తాయి



**సిటిసి ప్రిన్సిపాల్, అదనపు పోలీస్ కమీషనర్ కోటేశ్వర రావు**





టైమ్స్ ఆఫ్ వార్త - ఎడపల్లి

క్రీడలు శారీరక, మానసిక వికాసానికి దోహదం చేస్తాయని సిటిసి ప్రిన్సిపాల్, అదనపు పోలీస్ కమీషనర్ బి కోటేశ్వర రావు పేర్కొన్నారు. ఎడపల్లి మండలంలోని జాన్కంపేట్ గ్రామశివారులో గల నిజామాబాద్ కమీషనరేటు పోలీస్ శిక్షణ కేంద్రంలో స్టయిపాండరీ క్యాడెటు ట్రేయిని కానిస్టేబుల్స్ కు 9 నెలల శిక్షణ కాలంలో భాగంగా స్పోర్ట్స్ మీట్ 2024 ముగింపు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్బంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిధ క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు సిటిసి ప్రిన్సిపాల్, అదనపు పోలీస్ కమీషనర్ బి కోటేశ్వర రావు, అదనపు డిసిపి (ఎల్ అండ్ ఓ ), బస్వారెడ్డిలు బహుమతులను అందజేశారు. ఈ సందర్బంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిటిసి ప్రిన్సిపాల్, అదనపు పోలీస్ కమీషనర్ కోటేశ్వర రావు మాట్లాడుతూ... నిజామాబాదు ఎంతో మంది జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులను అందజేసిందని అన్నారు. అందులో ముఖ్యంగా నికత్ జరీన్, ఎండల సౌమ్య, ఓసామోద్దీన్ వంటి వారిని మన జిల్లా నుండే ఎదిగారని తెలిపారు. చేస్తున్న ఉద్యోగంతో పాటు క్రీడల్లో కూడా రాణించి జిల్లాకు, రాష్ట్రానికి, దేశానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. ప్రతి ఓటమి మరో గెలుపునకు నాంది పలుకుతుందని, పోటీల్లో ఓడిన వారు నిరుత్సాహం చెందకుండా రాబోయే ఆటల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లాలన్నారు. విద్య అనేది మనిషికి జ్ఞానాన్ని ఇచ్చి ఎలా మెరుగుపరుస్తుందో అదే విధంగా క్రీడలు కూడా మన జీవితానికి ఎన్నో పాఠాలు నేర్పిస్తాయన్నారు. ఉద్యోగం, విద్యతో పాటు క్రీడలు కూడా మనలో భాగస్వామ్యం అయినప్పుడు పరిపూర్ణత గల మనిషిగా అభివృద్ధి చెందుతారన్నారు. పలు పాఠశాలలకుచెందిన పిఈటిలు స్నేహపూరిత వాతావరణంలో ఈ క్రీడలు విజయవంతంగా జరపడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ మేరకు క్రీడలను విజవంతంగా పూర్తి చేసిన పలువురు శిక్షకులను, అథితులను పూల బొకేలతో, మెమోంటోలతో, సత్కరించారు. ఈ కార్యక్రమంలో సిటిసి ఏసీపీ (వైస్ ప్రిన్సిపాల్ ) మస్తాన్ అలీ, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ ఎస్ శ్రీనివాస్ రావ్, ఎఆర్ ఏసీపీ నాగయ్య, బోధన్ ఏసీపీ పి శ్రీనివాస్, సిఐ శివరాం, ఆర్ఐ శ్రీపాల్ తో పాటు రిజర్వు ఇన్స్పెక్టర్, ఆర్ఎస్ఐలు, శిక్షకులు,ఇంచార్జిలు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎడపల్లిలో మహిళ అదృశ్యం

టైమ్స్ ఆఫ్ వార్త - ఎడపల్లి



ఎడపల్లి మండల కేంద్రానికి చెందిన దొనగంటి అర్చన అనే మహిళ కనబడడం లేదంటూ కుటుంబీకులు బుధవారం ఎడపల్లి పోలీసులకు పిర్యాదు చేశారు. ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణ రెడ్డి తెలిపిన వివరాల మేరకు ఎడపల్లి గ్రామానికి చెందిన 26సంవత్సరాల దొనగంటి అర్చన ఈనెల 22నుండి కనబడడం లేదని భర్త దొన గంటి గంగదాస్ పిర్యాదు చేశారన్నారు. యువతి కుటుంబీకుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## నూతన ఎస్సై కి ఘన సన్మానం

టైమ్స్ అఫ్ వార్త-సూర్యాపేట జిల్లా ప్రతినిధి(పోతరాజు వెంకన్న)




తుంగతుర్తి మండల నూతన ఎస్సైగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రుద్రు క్రాంతి కుమార్ ను పోలీస్ స్టేషన్లో మండల దళిత నాయకులు బుధవారం శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం మీ సేవలు అమూల్యమైనవని, ప్రజా సమస్యల పరిష్కారానికి న్యాయపరంగా కృషి చేయాలని ఎస్సైని కోరారు. ఈ సందర్భంగా ఎస్సై వారికి ధన్యవాదాలు తెలిపారు తుంగతుర్తి మండలంలో యువత తప్పుడు మార్గంలో నడవకుండా మత్తు పానీయాలకు దూరంగా ఉండే విధంగా కృషిచేసి శాంతిభద్రతల పరిరక్షణపై తన వంతు కృషి చేస్తారని తెలియజేశారు . ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు చింతకుంట్ల వెంకన్న, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు తప్పట్ల శంకర్, జిల్లా నాయకులు దాసరి శ్రీను, పోలేపాక రామచంద్రు, కలకోట్ల మల్లేష్, ఇరుగు సైదులు, బొంకురి నాగయ్య, మాచర్ల అనిల్, మిరియాల నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్ హౌస్ కార్యక్రమంలో విద్యార్థులకు అవగాహన



టైమ్స్ ఆఫ్ వార్త-మంచిర్యాల జిల్లా ప్రతినిధి

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా చట్టాలు, పోలీసుల విధులపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకే బుధవారం జిల్లాలోని రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణాపూర్ ఎస్ఐ రాజశేఖర్ విద్యార్థులకు పోలీసులు వాడే ఆయుధాలతో పాటు ఇతర పరికరాలు, వాటి పని విధానాలు గురించి వివరించారు. అదేవిధంగా శాంతి భద్రత పరీక్ష పర్యవేక్షణలో పోలీసులు వాడ ఆయుధాలు, ఆధునిక సాంకేతిక పరికరాలను ప్రదర్శించి, వాటి గురించి వివరించారు. ఆయుధాలతో పాటు వాటి విడి భాగాలు, ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ నెట్వర్క్ సిస్టం, పోలీస్ కంట్రోల్ రూమ్ పరికరాలు, కమ్యూనికేషన్ మ్యాన్ ప్యాక్ సెట్ లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్ఐ,పోలీసుల సిబ్బంది విధుల గురించి, రికార్డుల గురించి, నేరం జరిగిన సమయంలో వివిధ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు, దర్యాప్తు, విచారణ నిందితులను పట్టుకోవడం, వారిని కోర్టు ముందు హాజరుపరచడం, వారికి పడే శిక్షల గురించి వివరించారు. పోలీస్ శాఖ ఉపయోగిస్తున్న సాంకేతిక పరిజ్ఞానం గురించి, డయల్ 100, బ్లూ క్లోట్స్, పెట్రోకార్ సిబ్బంది విధులు, షీ టీమ్స్ పనితీరు, మహిళల రక్షణ కోసం ఉన్న సాంకేతిక యాప్ ల గురించి, సైబర్ నేరాలపై డయల్ 1930, చైల్డ్ హెల్ప్ లైన్ పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీసుల విధులపై అవగాహన కొరకే ఓపెన్ హౌస్ కార్యక్రమం







టైమ్స్ ఆఫ్ వార్త-మందమర్రి

పోలీసులపై ప్రజల్లో ఉన్న భయాన్ని, అపోహలను దూరం చేస్తూ, పోలీసుల విధులపై ప్రజలకు ముఖ్యంగా విద్యార్థులకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని పట్టణ ఎస్ఐ ఎస్ రాజశేఖర్ తెలిపారు. పోలీస్ అమర వీరుల స్మారకోత్సవాలలో భాగంగా బుధవారం పట్టణ పోలీస్ స్టేషన్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో పాటు పట్టణంలోని పాఠశాల విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించి, విద్యార్థులకు పోలీస్ కార్యకలాపాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజశేఖర్ మాట్లాడుతూ, పోలీస్ అమరవీరుల త్యాగాలను, సేవలను స్మరించుకుంటూ, అక్టోబర్ 21 నుండి 31 వరకు నిర్వహిస్తున్న అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్, ఐపిఎస్, ఐజి, మంచిర్యాల డిసిపి ఏ భాస్కర్, ఐపీఎస్, బెల్లంపల్లి ఏసిపి ఏ రవికుమార్ ల ఆదేశాల మేరకు పట్టణ పోలీస్ స్టేషన్లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఉండే రిసెప్షన్ వ్యవస్థ, కేసు డైరీలు, హిస్టరీ షీట్స్, స్టేషన్ లాకప్, స్టేషన్లో ఉపయోగించే ఆయుధాలు, డయల్ 100 వ్యవస్థ పని చేయు విధానం, పోలీసుల ముఖ్య విధులు, పోలీస్ యూనిఫామ్, ట్రాఫిక్ రూల్స్, నూతన చట్టాలు, ఇతర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా పోలీసుల రోజువారి విధుల్లో అత్యంత కీలకంగా వ్యవహరించే కమ్యూనికేషన్ విధానము గురించి వివరించి, విద్యార్థులచే పోలీస్ కంట్రోల్ రూమ్ చేత మాట్లాడించారు. ఓపెన్ హౌస్ కార్యక్రమానికి హాజరైన విద్యార్థి విద్యార్థులు ఎంతో ఆసక్తి వ్యక్తపరచు, పోలీసులతో కలిసి పోలీసు వ్యవస్థ పని తీరు గురించి తెలుసుకొని, ఆనందం వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో పట్టణ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే వినోద్ తో సమావేశమైన జజ్జరవెల్లి కాంగ్రెస్ నాయకులు



టైమ్స్ ఆఫ్ వార్త-మంచిర్యాల జిల్లా ప్రతినిధి

జిల్లాలోని బెల్లంపల్లి నియోజకవర్గంలోని జజ్జరవెల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నేతలు బుధవారం హైదరాబాద్ లోని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి నివాసంలో ఆయనతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, గ్రామంలో నెలకొన్న సమస్యలు ఎమ్మెల్యేకు విన్నవించారు. కొత్తపల్లి గ్రామంలోని సర్వేనెంబర్ 89లో ప్రజలు గత 50 సంవత్సరాలుగా సాగు చేసుకున్న ప్రభుత్వ భూమిని అటవీశాఖ అధికారులు రిజర్వ్ ఫారెస్ట్ కు చెందిందని ప్రజలను సాగు చేయకుండా అడ్డుకుంటున్నారని, గతంలో ఈ సమస్యపై జాయింట్ సర్వే జరిపించి, కేవలం ఆరుగురికి మాత్రమే సాగుకు అంగీకరించారని, మిగతా వారిని సాగు చేయకుండా అడ్డుకుంటున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే వినోద్ త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారం చూపుతానని, సంబంధిత అధికారులతో మాట్లాడి, ప్రజలకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కన్నెపల్లి మాజీ ఎంపీపీ మాధవరపు సృజనా నర్సింగరావు మాట్లాడుతూ, గ్రామ స్థాయిలో ఉన్న కార్యకర్తలు పార్టీ కోసం కష్టపడి పని చేయాలని, కష్టపడే వారికి ఉన్నత స్థానం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తాళ్లపల్లి రాజలింగు, మెరుగు ప్రసాద్, దుర్గం దసరయ్య, కొట్రంగి రాజ్ కుమార్ లు పాల్గొన్నారు.

జనరల్ న్యూస్
GENERAL NEWS
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దినపత్రిక
గురువారం,
24-10-2024


## సోమలింగేశ్వర ఆలయాన్ని సందర్శించిన పిట్ల కృష్ణ మహారాజ్ జి



టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ

బాన్సువాడ రెవెన్యూ డివిజన్ కేంద్రానికి అతి సమీపంలో ఉన్న సోమలింగేశ్వర ఆలయాన్ని బుధవారం రాత్రి శివుని జన్మ నక్షత్రమైన ఆరుద్ర నక్షత్రం సందర్భంగా మల్లారం లింగేశ్వర ఆశ్రమం పీఠాధిపతులు తపస్వి బాలయోగి, శ్రీశ్రీశ్రీ పిట్ల కృష్ణ మహారాజ్ జి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. దక్షిణ కాశీగా పేరుగాంచిన సోమలింగేశ్వరునికి జలాభిషేకం ,పంచామృతాభిషేకం, భస్మాభిషేకం చేపట్టి, ధూప, దీప, నైవేద్యాలు, సమర్పించి మంగళ హారతులు ఇచ్చారు. చందూరి లాస్య- భాస్కర్, యు. లావణ్య- మోహన్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామీజీకి పాదపూజ చేపట్టి హారతి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. దుర్గి గ్రామ భజన మండలి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా భజన చేపట్టారు. శ్రీ హనుమాన్ దీక్ష సేవా సమితి బాన్సువాడ వారి ఆర్థిక సౌజన్యంతో భక్తులకు అల్పాహార ప్రసాద వితరణ చేపట్టారు. స్వామీజీ భక్తులను ఉద్దేశించి ఆధ్యాత్మిక ప్రసంగం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎరాజ్పల్లి గంగన్న మహారాజ్, దుర్గి పబ్బతి రాజు గురుస్వామి తోపాటు శ్రీ హనుమాన్ దీక్ష గురుస్వాములు పాలకుర్తి దత్తు, అంబిలి పూర్ రాజు, తోపాటు భక్తులు బంగారు మైసయ్య, ఉప్పరి సాయిలు, గైని మొగులయ్య తోపాటు శివ భక్తులు, మహిళలు, యువకులు, పాల్గొన్నారు.

## రక్తదానం మహాదానం..రక్తదానంపై అపోహలు వద్దు..





**రామగుండం పోలీస్ కమిషనర్ ఎం .శ్రీనివాస్, ఐపిఎస్, ఐజి**

**మంచిర్యాల సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం**

**100 యూనిట్ల రక్త సేకరణ**

టైమ్స్ ఆఫ్ వార్త-మంచిర్యాల జిల్లా ప్రతినిధి

రక్తదానం చేయడం సామాజిక సేవా కార్యక్రమం అని, క్లిష్ట పరిస్థితుల్లో ఆపదలో ఉన్న వారి ప్రాణాలు రక్షించడమే ఎంతగానో ఉపయోగపడుతుందని, రక్త దానం మహాదానం అని, రక్తదానంపై అపోహలు వద్దు అని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్, ఐపీఎస్, ఐజి తెలిపారు. పోలీసుల అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జోన్ మంచిర్యాల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆవరణంలో మంచిర్యాల సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో బుధవారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపి ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ, అమరవీరులు సమాజం కోసం, దేశం కోసం, రేపటి తరాల మంచి భవిష్యత్తు కోసం, ప్రాణత్యాగాలు చేశారని వారి త్యాగాలను వెలకట్టలేమన్నారు. అమరవీరుల త్యాగ ఫలంగానే నేడు దేశ, రాష్ట్ర ప్రజలందరూ శాంతియుతంగా, ప్రశాంతంగా ఉన్నారని తెలిపారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి రక్తదానం చేసి వారి పాలిట దేవుళ్లుగా మారతారని తెలిపారు. తలసేమియా, క్యాన్సర్, మెడికల్ ఎమర్జెన్సీ రోగులకు, బ్లడ్ క్యాన్సర్ రోగులకు, హీమోఫోలియా, అదేవిధంగా ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారికి తదితర జబ్బులతో బాధపడుతున్న వారికి ఎక్కువగా రక్తం అవసరం ఉంటుందని, ప్రతి ఒక్కరు ఇలాంటి సామాజిక సేవలో పాల్గొని, తోటి వారి ప్రాణాలు కాపాడడంలో తమ వంతు సహాయంగా రక్తదానం చేయడం మంచి సామాజిక సేవా కార్యక్రమని అన్నారు. ఆపదలో ఉన్న ప్రాణాలు రక్షించడానికి ఎంతో ఉపయోగపడుతుంది. ప్రతి ఒక్కరు వారి వారి ఆరోగ్య పరిస్థితిని బట్టి, ఆరోగ్యంగా ఉండే ప్రతి మనిషి ఆరు నెలలకు ఒకసారి రక్తదానం చేయాలని సూచించారు. అనంతరం రక్తదానం చేసిన వారికి ప్రశంస పత్రాలు అందించి, అభినందించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డిసిపి ఏ భాస్కర్, ఐపీఎస్, మంచిర్యాల ఏసిపి ప్రకాష్, మంచిర్యాల పట్టణ సిఐ ప్రమోద్ రావు, మంచిర్యాల రూరల్ సీఐ అశోక్ కుమార్, లక్షెట్టిపేట సిఐ నరేందర్, మంచిర్యాల మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ నరేష్ కుమార్, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి, కార్యదర్శి మహేందర్, మంచిర్యాల సబ్ డివిజన్ పరిధిలోని ఎస్ఐ లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## శబరిమలై మహాపాదయాత్ర గురుస్వామి దంపతులను సన్మానించిన శిష్య బృందం ప్రతినిధులు

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ



బాన్సువాడలో ఉదయం బిచ్కుంద అయ్యప్ప స్వామి ఆలయ పూజారి గజానన్ మహారాజ్ గురుస్వామి, మంద బాద్ విట్టల్ గురుస్వామి, బిచ్కుంద కప్ప గణేష్ గురు స్వామి, రాహుల్ గురు స్వామి వారి మిత్రబృందం పెద్ద ఎత్తున 40 మంది స్వాములు ఈరోజు ఇంటికి వచ్చి మేము అమెరికా యాత్రసంపూర్ణంగావిజయవంతంగా పూర్తి చేసుకొని బాన్సువాడకు వచ్చిన సందర్భంగా వారు పెద్ద ఎత్తున వచ్చి మాకు ఘనంగా సన్మానించి మమ్ములను ఎంతో ఆనందపరిచినందుకు వారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాం. వారికి వారి కుటుంబ సభ్యులకు అయ్యప్ప స్వామి అనుగ్రహం లభించాలని మేము భగవంతుని మనస్ఫూర్తిగా కోరుతున్నాం. అలాగే ఎల్లారెడ్డి, తాండూర్, గురు స్వాములు భీమ్ రెడ్డి గురుస్వామి, డాక్టర్ రఘు వీరు గురుస్వామి, ప్రవీణ్ స్వామి, బాన్సువాడ బిందు వెంకటేశం గురుస్వామి వచ్చి మేము అమెరికా యాత్ర సంపూర్ణంగా విజయవంతం చేసి బాన్సువాడకు వచ్చిన సందర్భంగా మాకు వారు ఘనంగా సన్మానించడం జరిగింది. వారికి వారి కుటుంబ సభ్యులకు ఆయురారోగ్యాలతోటి అష్టైశ్వర్లతోటి ఆనందంగా సంతోషంగా ఉంచాలని భగవంతుని కోరుతూ వారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాం. ఈ కార్యక్రమంలో శిష్య బృందం ప్రతినిధులు, తదితరులు, పాల్గొన్నారు.

## గిరిజనులను ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తప్పవు



టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ

గిరిజనులను అకారణంగా ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తప్పవని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జటోత్ హుస్సేన్ నాయక్ అన్నారు. గిరిజనుల పంట భూముల విషయమై గతంలో అధికారులు ఇబ్బందులు గురిచేయడంతో రైతులు కమిషన్ను ఆశ్రయించారు. ఈ సందర్భంగా మండలంలోని కాదులాపూర్ లో బుధవారం జాతీయ ఎస్టి కమిషన్ సభ్యుడు పర్యటించారు. 2021లో గిరిజనులను ఎదురైన సమస్యలపై అధికారులతో చర్చించారు. స్థానిక నాయకుల అండదండలతో అధికారులు, పోలీసులు, గిరిజనులపై దాడులు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కిరణ్ మై ,తాసిల్దార్ వరప్రసాద్, డిఎస్పి సత్యనారాయణ, అటవీశాఖ అధికారులు, తదితరులు, పాల్గొన్నారు.

## కూకట్‌పల్లిలో అభివృద్ధే లేదు అన్న ఈటెల వ్యాఖ్యలపై ఎమ్మెల్యే స్పందించాలి

**నియోజకవర్గాన్ని సర్వాంగ సుందరంగా, బంగారంగా తీర్చిదిద్దానని కథలు కథలుగా చెబుతున్న స్థానిక ఎమ్మెల్యే కృష్ణారావు : బండి రమేష్**

టైమ్స్ ఆఫ్ వార్త - కూకట్ పల్లి



సీఎం రేవంత్ రెడ్డి, ఎంపీగా మల్కాజ్గిరి నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని చూసి సీఎంగా ఆయనకు తెలంగాణ ప్రజలు ప్రమోషన్ ఇచ్చారని కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ కొనియాడారు. అయితే కూకట్పల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్న మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ వ్యాఖ్యలకు ఎమ్మెల్యే కృష్ణారావు సమాధానం చెప్పాలని బండి రమేష్ డిమాండ్ చేశారు. గత పది ఏళ్లలో కూకట్పల్లి నియోజకవర్గంలో పదివేల కోట్ల రూపాయలతో నియోజకవర్గాన్ని సర్వాంగ సుందరంగా, బంగారంగా తీర్చిదిద్దానని స్థానిక ఎమ్మెల్యే కృష్ణారావు కథలు కథలుగా చెబుతారు కదా? ఇలాంటి అభివృద్ధి ఈటెల రాజేందర్ కు కనిపించకపోవడం హాస్యాస్పదమన్నారు. మాట్లాడితే నియోజకవర్గం లో 90 శాతం పనులు పూర్తి చేసామని బ్రిడ్జిలు కట్టాం, నాళాల మీద కల్వర్టులు కట్టాం సిమెంట్ రోడ్లు వేసాం పార్కులు సుందరీకరణ చేసామంటూ కృష్ణారావు మహా గొప్పలు చెప్పుకుంటాడని బండి రమేష్ ఎద్దేవా చేశారు. అభివృద్ధి చేశాం అంటూ చెప్పిందే చెప్పి పదేళ్ల తర్వాత కూడా మళ్లీ పనులు తానే చేస్తున్నట్టు చెప్తూనే ఉన్నాడు. నియోజకవర్గంలో ఇంత గొప్పగా అభివృద్ధి జరిగితే ఎంపీ ఈటెల మాత్రం అభివృద్ధి ఏమాత్రం జరగలేదని అంటున్నాడు దీనికి కృష్ణారావు ఖచ్చితంగా సమాధానం చెప్పి తీరాలి తను తెచ్చిన పదివేల కోట్ల రూపాయలు ఎక్కడ ఏ పనులకు కేటాయించారో లెక్క చెప్పాల్సి ఉందని రమేష్ ప్రశ్నించారు. ప్రస్తుత ఎంపీ అప్పటి టిఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా కూడా ఉన్నారని మంత్రిగా ఆయన ఎంత అభివృద్ధి చేశారో ఆయన కూడా సమాధానం చెప్పాల్సి ఉందన్నారు. మల్కాజ్గిరి నియోజకవర్గంలో రేవంత్ రెడ్డి , చేసిన పనులతోనే ఆయనకు తెలంగాణ ప్రజలు ముఖ్యమంత్రిగా ప్రమోషన్ ఇచ్చారని రమేష్ పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించి ఇవ్వడం చేతగాక చేతులెత్తేసిన దళిత బంధు, డబల్ బెడ్ రూమ్ ఇళ్లు రేషన్ కార్డులు షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి వంటి పథకాలను లబ్ధిదారులకు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అందజేస్తుందన్నారు. నియోజకవర్గంలో వరద ముంపుకు గురవుతున్న అల్లాపూర్ ప్రాంతాన్ని రక్షించేందుకు రూ .27 కోట్లతో సున్నం చెరువు నుండి కాముని చెరువు వరకు నాలాను అభివృద్ధి చేస్తున్నామన్నారు. కైతలాపూర్ నుండి రెయిన్బో విస్టా వరకు రోడ్డు అభివృద్ధి పనులు, పీజీ కాలేజీ ఏర్పాటు జేఎన్టీయూ నుండి హైటెక్ సిటీ వరకు స్కై బస్ వంటి ప్రతిపాదనలు ఉన్నాయన్నారు.

## హెచ్ఎం ఖలీల్ అహ్మద్‌ను తొలగించాలని సబ్ కలెక్టర్‌కు గ్రామస్తుల వినతి



టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ

బాన్సువాడ మండలంలోని బుడ్మి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంచార్జి హెచ్ఎంపై గ్రామస్తులు ఆరోపణలు చేశారు. పాఠశాలలో సరస్వతి మాతకు పూజలు చేయరాదని విద్యార్థులకు హెచ్ఎం ఖలీల్ తెలిపారని, ఈ విషయమై సబ్ కలెక్టర్ కిరణ్ మయి గ్రామస్తులతో విచారణ చేపట్టారు. పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో సబ్ కలెక్టర్ మాట్లాడారు. గ్రామస్తులు మాట్లాడుతూ ఈ ఉపాధ్యాయుడు మాకు వద్దంటూ సబ్ కలెక్టర్తోమొరపెట్టుకున్నారు. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ వివరణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలోడిఎస్పిసత్యనారాయణ, ఎంఈఓ నాగేశ్వరరావు, సి. ఐ. అశోక్, తదితరులున్నారు.

## గొర్రెల ప్రాథమిక సహకార సంఘం అధ్యక్ష కార్యదర్శులుగా ఇమ్మడి, బట్టు తిరుపతిరావు

టైమ్స్ ఆఫ్ వార్త-చింతకాని



నాగులవంచ శ్రీరామ గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం సలహా మండలి ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగి నాయి. అధ్యక్షులుగా ఇమ్మడికాశయ్య, ప్రధాన కార్యదర్శిగా బట్టు తిరుపతిరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.కమిటీ సభ్య లుగా పరిటాల పద్మ, ఎరదేశి రవి , చిర్రా భారతమ్మ , అమరబోయిన పుల్లా రావు, తోట లక్ష్మణరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్..

**సీఐటీయూ ఆశ వర్కర్స్ యూనియన్ నాయకురాలు సబియా**

టైమ్స్ ఆఫ్ వార్త - కూకట్ పల్లి

కూకట్ పల్లి నియోజకవర్గం బాలానగర్ మండలం లోని ఇంద్రనగర్ బస్తీలోని అంబేద్కర్ భవనం లో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఎల్వీ ప్రసాద్ హాస్పిటల్ సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు రాలు సబియా మాట్లాడుతూ మానవ సేవే- మాధవ సేవ అని అన్నారు. పేద ప్రజలకు కంటి చూపు సమస్య ల తో చాలా మంది బాధపుతున్నారని గుర్తించి ఎల్వీ హాస్పిటల్ లో పని చేసే ఫార్మ్యాన్ సహకారం తో పేద ప్రజలకు కండ్ల అద్దాలు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ సోమలత, మంజుల, మారుత బస్తీ ప్రజలు పాల్గొన్నారు.



## సూపరింటడెంట్‌కు సన్మానం

టైమ్స్ ఆఫ్ వార్త-చింతకాని



ప్రముఖ వైద్యులు,ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటడెంట్ కేశగాని రాజశేఖర్ గౌడ్ ని మర్యాదపూర్వకంగా కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.

TIMES OF VARTHA (24-10-2024)M_times of varha main (13-2).qxd 10/24/2024 6:34 AM Page 6



# సర్వత్ర ఉత్కంఠ నిరసనల హోరు.. రసాభసా..

**పోలీస్ పహారాలో అంబుజా సిమెంట్ ఫ్యాక్టరి ప్రజాభిప్రాయ సేకరణ సమావేశం**

**రామన్నపేటలో జేపీసీ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ**

**కంపెనీ వ్యతిరేక నినాదాలతో దద్దరిల్లిన సభా ప్రాంగణం**

**ఆదాని సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు ముక్తకంఠంతో వ్యతిరేకిచ్చిన వేలాదిమంది ప్రజలు**

**ప్లే కార్డులతో భారీ ప్రదర్శన నిర్వహించిన జేపీసీ నాయకులు,రామన్నపేట బార్ కౌన్సిల్ న్యాయవాదులు**

టైమ్స్ ఆఫ్ వార్త - యాదాద్రి










తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి నల్గొండ అధికారులు బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేటలో ఆదాని అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ సంవత్సరానికి ఆరు మిలియన్ మెట్రిక్ టన్ల సిమెంట్ ఉత్పత్తి కోసం ప్రతిపాదిత అనుమతుల కోసం బుధవారం నిర్వహించిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ బహిరంగ సభ నిరసనల హోరుతో ఘంటపరితంగా పోలీస్ వారాలు ముగిసింది. ఈ సమావేశానికి యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ (రెవిన్యు) కాలుష్య నియంత్రణ మండలి నల్గొండ అధికారిని తోబాటు ఇతర అధికారుల సాధ్యంలో నిర్వహించబడ్డది. ఉదయం నుండి వివిధ గ్రామాలకు చెందిన రాజకీయాలకు అతీతంగా ఏర్పడ్డ జేపీసీలకు చెందిన వేలాది మంది నాయకులు కార్యకర్తలు మహిళలు సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు నిరసిస్తూ పట్టుకున్న ప్లే కార్డులతో సమావేశానికి హాజరయ్యారు. యావత్ సభాపాలన ప్లేకార్డులు అంబుజా సిమెంట్ కంపెనీ ఏర్పాటుకు వ్యతిరేకిస్తూ చేస్తున్న నినాదాలతో దద్దరిల్లింది. మరోవైపు ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా ప్రతిపక్ష మాజీ ఎమ్మెల్యేలను పోలీసులు ఉదయం నుండి హౌస్ అరెస్టులు, ప్రత్యక్ష గా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్లకు తరలింపు ఉదయం నుండి కొనసాగుతున్నాయి. సుమారు 20 గ్రామాలకు చెందిన 70 మంది నాయకులు మహిళలు యువత ఉదయం నుండి రామన్నపేటకు చేరుకున్నారు. అంభుజ సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు పైపర్యావరణ అధికారులు నిర్ణయించనున్న ప్రజాభిప్రాయ సేకరణకు హాజరైనందుకు స్వచ్ఛందంగా చేతులలో సిమెంట్ ఫ్యాక్టరీ వ్యతిరేక నినాదాలతో కూడిన ప్లే కార్డులను చేత భూమి హరి స్థాయిలో నినాదాలు ఇచ్చారు, మెజార్టీ ఉద్యమకారులను సమావేశానికి వెళ్లకుండా భారీ స్థాయిలో ఏర్పాటు చేసిన పోలీసులు అడుగున అడ్డుకున్నారు. అయినప్పటికీ వేలాదిమంది ఫ్యాక్టరీ వ్యతిరేకించే నిరసనకారులు తమ ప్రాణాలను ఘనంగా పెట్టి అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయబోనని ప్రతీనబూనారు. రాజ్యసభ మాజీ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్, నకిరేకల్ టిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య. నల్గొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి, టిఆర్ఎస్ మాజీ నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, ప్రజా పోరాట సమితి నాయకులు నూనె వెంకటస్వామి తదితరులు సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు వ్యతిరేకిస్తూ అధికార కలిసేందుకు వచ్చే క్రమంలో ఉమ్మడి నల్గొండ జిల్లా పోలీసులు ఎక్కడికక్కడ వారిని అరెస్ట్ చేశారు. అంతేగాక సభా ప్రాంగణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరసనకారులను చిత్రీకరించ సాగారు. ఈ ప్రాంత ప్రజల జీవితాలతో ప్రత్యక్షంగా ప్రభావితం చేసే అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీని తమ కంఠంలో ప్రాణాలంతా ఉన్నంతకాలం వ్యతిరేకిస్తామని తెలిపారు. చట్టపరంగా ఈ ఫ్యాక్టరీని ఏర్పాటు కాకుండా న్యాయ పోరాటానికి కూడా వెనుకడమని హెచ్చరించారు. రామన్నపేటలో కాలుష్య భరిత ప్రాంతంగా చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సహకరిస్తే రాజకీయాలకతీతంగా టిఆర్ఎస్ కాంగ్రెస్ సిపిఎం సిపిఐలతో కూడిన జాయింట్ యాక్షన్ కమిటీ గ్రామ గ్రామాన ఆదానికి వ్యతిరేకంగా ఉద్యమాలను నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని తెలిపారు. కంపెనీ ఏర్పాటుకు సంబంధం లేని కొందరు పార్టీకి మద్దతుగా మైక్లో మాట్లాడుతుంటే కోపో ద్రిక్తులైన నిరసనకారులు వారిని నిలదీయడంతో, వారిని పోలీసులు వేరే ప్రాంతానికి తరలించారు.. ఇదేమైనా సిమెంట్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా వేలాదిమంది నిరసనకారులు కంపెనీ ఏర్పాటుకు నివసిస్తూ ప్లే కార్డు పట్టుకొని భారీ సమావేశం ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. ఈ నిరసన ర్యాలీలో పాల్గొన్న రామన్నపేట బార్ కౌన్సిలింగ్ న్యాయవాదులు మాట్లాడుతూ ఎటువంటి పరిస్థితుల్లోనైనా అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీని రామన్నపేటలో ఏర్పాటు చేయ నీయమని ప్రతిజ్ఞ చేశారు. అవసరమైతే ఉన్నత న్యాయస్థానాల్లో అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ప్రతిపాదిత కంపెనీ బ్రోచర్లో పేర్కొన్న తప్పులను హైకోర్టులో నిలదీస్తామని హెచ్చరించారు. వారు గతంలో కొనుగోలు చేసిన 365 ఎకరాల్లో ఏ ఏ సర్వే నెంబర్లు సిమెంట్ ఫ్యాక్టరీని నిర్మించబోతున్నారు తెలుపకుండా కాలుష్య నియంత్రణ మండలి పబ్లిక్ హియరింగ్ను ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు.

## మాలల ఆత్మగౌరవ సభ పోస్టర్ ఆవిష్కరణ

**చేసిన మాలమహానాడు నాయకులు**



టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ

బాన్సువాడ నసుర్లబాద్ మండలాల నాయకులతో కలసి మాల మహానాడు పొలిటికల్ జేపీసీ ఉమ్మడి నిజామాబాదు జిల్లా ఇంచార్జీ గైని ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేయాలనీ సుప్రీం కోర్టు తీర్పు వెతిరేకిస్తూకేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణ పై నిర్ణయాన్ని వెనకకు తీసుకోవాలని 27న నాగర్ కర్నూల్లో వర్గీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న మాలల ఆత్మ గౌరవ భాహిరంగ సభ జరుగుతున్నందున మాలలు అందరు హాజరై విజయవంతం చేయాలనీఅన్నారు. ఈకార్యక్రమంలో మాలమహానాడు దళిత నాయకులు దొన కంటి వెంకటేష్ చింతల గంగాధర్ మల్లారి సాయిలు ,బంగారుమైసయ్య,నర్సింలు నసుర్లబాద్ బాల సాయిలు, మన్నె చిన్న సాయిలు, బేగరి డాక్టర్ సాయిలు, దుర్కి సురేష్, తదితరులు, పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ పథకాలు, ప్రభుత్వ ఆలోచనలు ప్రజలలోకి సమర్ధవంతంగా తీసుకెళ్లాలి

టైమ్స్ ఆఫ్ వార్త - కూకట్ పల్లి



తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ గా నియమితులైన టిపిసిసి సీనియర్ అధికార ప్రతినిధి ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ గా నియమితులైన టిపిసిసి సీనియర్ అధికార ప్రతినిధి కాల్వ సుజాత ని కూకట్పల్లి నియోజకవర్గానికి చెందిన నాయకులు గ్రేటర్ హైదరాబాద్ మాజీ ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి దినేష్ కుమార్, కెపిహెచ్బి డివిజన్ కంటెస్టెంట్ కార్పొరేటర్ గంధం రాజు, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి పెంద్రు రమారెడ్డి మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా కాల్వ సుజాత మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెడుతున్న పథకాలు ప్రభుత్వ ఆలోచనలు సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకొని వెళితే రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజలకు ఇంకా నమ్మకం కలుగుతుందని , కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు పార్టీలో కష్టపడే వారికి తగిన గౌరవం ఇస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలకు గాని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు గాని ఏ కష్టం వచ్చినా ఆ సమస్య పరిష్కరించడానికి తాను ముందు వరుసలో ఉంటానని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేష్ యాదవ్, సుబ్బు నాయుడు, దార్ల వనజ ,వీణ ,సుజాత, వాణి రోజా, దుర్గా , సరోజ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర మాజీ మంత్రి 'సర్వే'ను ఘనంగా సత్కరించిన శేరి సతీష్ రెడ్డి



టైమ్స్ ఆఫ్ వార్త - కూకట్ పల్లి

కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ ను కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సర్వే సత్య నారాయణను శేరి సతీష్ రెడ్డి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో కి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నారని వాటిని ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. భవిష్యత్తులో సైతం జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించడానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు బిఎస్పి కూకట్పల్లి కంటెస్టెడ్ అభ్యర్థి ప్రస్తుత కాంగ్రెస్ సీనియర్ నాయకులు బి సంజీవరావు, చిటకోరు కృష్ణ, రాచమల్ల శేఖర్ గౌడ్, సోషల్ మీడియా ఇంచార్జ్ జి శేఖర్, రావుఫ్, తదితరులు పాల్గొన్నారు.

## తాటిపాముల సోమయ్య చిత్రపటానికి ఘన నివాళులు




టైమ్స్ ఆఫ్ వార్త సూర్యాపేట జిల్లా ప్రతినిధి (పోతరాజు వెంకన్న)

సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలో యంగ్ డైనమిక్ యూత్ కాంగ్రెస్ లీడర్ తాటిపాముల జలంధర్ తండ్రి తాటిపాముల సోమయ్య దశదిన కర్మ కార్యక్రమానికి హాజరై వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన చిన్ననాటి స్నేహితులు. మీ కళ్ళల్లో చెమ్మగిల్లి కన్నీరు మీయొక్క అమాయకత్వం మృదు స్వభావం మీ కళ్ళల్లోనే కనిపిస్తున్న మీరు తిరిగిరాలి అనంత లోకాలకు వెళ్లిన మీకు మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ ..నీ కుమారి యొక్క బాల్య మిత్రులు స్నేహితులు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ రిపోర్టర్, పోతరాజు వెంకన్న, కత్తుల లక్ష్మయ్య, శివ రాములు, కుంభం యాగన్న, మూడ శ్రీనివాస్, యాదగిరి, సుదర్శన్, వెంకన్న, ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.



## అమోయ్ కుమార్పై ప్రశ్నల వర్షం



**హైదరాబాద్:** భూ కేటాయింపుల్లో అక్రమాలు జరిగాయనే ఆరోపణ ల నేపథ్యంలో ఐఎఎస్ అధికారి అమోయ్ కు మార్ను ఇడి బుధవారం విచారించింది. బు ధవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు అమోయ్ కుమార్ని దాదాపు ఏడున్నర గంటల పాటు సుదీర్ఘంగా ఇడి అధికారులు ప్రశ్నించారు. బుధవారం నాటి విచారణలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్గా పనిచేసిన సమయంలో జిల్లాలో భూదాన్ భూముల్లో జరిగిన అవకతవకల పై అమోయ్కుమార్ని ఇడి ప్రశ్నించినట్లు సమాచారం. ఇదే అంశంలో తహసీల్దార్ జ్యోతి, ఆర్డివో, ఇతర సిబ్బంది చేసిన అ వకతవకలపైనా ఇడి ఆరా తీసినట్లు సమాచారం. భూదా న్ భూముల్లో జరిగిన అవకతవకలపై మీ దగ్గర ఉన్న సమాచారాన్ని ఇవ్వాలని అమోయ్కుమార్ని ఇడి కోరినట్లు తెలిసింది. కాగా గత ప్రభుత్వ హయాంలో అమోయ్కుమార్ రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు కలెక్టర్గా పనిచేశారు. ఆ సమయంలో భూదాన్ భూములతో పాటు పలు ప్రాంతాలలో భూకేటాయింపుల్లో భారీ అక్రమాలు జరిగినట్లు ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో అబ్దుల్లాపూర్మెట్లో తమ భూములు అన్యాక్రాంతంపై స్థానిక రైతులు ఇచ్చిన ఫిర్యాదులపై సైతం ఇడి ప్రశ్నించినట్లు తెలుస్తోంది. కాగా, గురువారం కూడా అమోయ్కుమార్ని ఇడి అధికారులు విచారించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

### అసలేం జరిగింది?

గత ప్రభుత్వ హయాంలో హాట్స్పాట్గా భావించే రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు ఆయన కలెక్టర్గా ఉన్నారు. ఆ సమయంలో 50 ఎకరాల భూదాన్ భూముల అన్యాక్రాంతం అయినట్లు ఇడి అధికారులు గుర్తించారు. విజిలెన్స్ విచారణలో భూదాన్ భూముల భాగోతం వెలుగు చూసింది. ఇదే వ్యవహారంలో అప్పటి ఎంఆర్వో జ్యోతిపై కేసు నమోదు అయిన సంగతి తెలిసిందే. జ్యోతిపై కేసు నమోదైన తరువాత విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. విజిలెన్స్ విచారణ ఆధారంగా ఇడి దర్యాప్తు నిర్వహించింది. ఈ క్రమంలో అప్పటి రంగారెడ్డి జిల్లా కలెక్టర్గా అమోయ్ కుమార్ ఉండడంతో ఆయనకు నోటీసు జారీ చేసిన ఇడి బుధవారం విచారణ నిర్వహించింది. కాగా, నాగరంలోని సర్వే నెంబర్ 181, 182 లోని 102.2 ఎకరాలపై కొంత కాలంగా వివాదం నడుస్తోంది. ఇందులో 50 ఎకరాల భూమి భూదాన్ బోర్డ్కు చెందినదని బోర్డు వాదిస్తోంది. అయితే ఈ భూమి జబ్బార్దస్త ఖాన్ అనే వ్యక్తి పేరు మీద రిజిస్ట్రేషన్ అయి ఉంది. తరువాత కాలంలో జబ్బర్దస్తు ఖాన్ కొడుకు హాజీ ఖాన్ ఈ 50 ఎకరాలు ల్యాండ్ను భూదాన్ బోర్డ్కు దానం చేశారు. అయితే 2021లో హాజీఖాన్ వారుసరాలినంటూ 40 ఎకరాలు తనదేనని ఖాదురున్నీసా అనే మహిల దరఖాస్తు చేసింది. దీంతో ఆఘమేఘాల మీద ఆమె పేరు మీద భూమి రిజిస్ట్రేషన్ జరిగిపోయింది. క్షేత్ర స్థాయిలో ఆర్డీవో , తహశీల్దార్, ఆర్ఐలు, సీనియర్ అసిస్టెంట్ ఆమెకి అనుకూలంగా పని చేసినట్లు విచారణలో బహిర్గతమైంది. అనంతరం ఈ భూమిని రియల్ ఎస్టేట్ కంపెనీకి అమ్మకాలు చేసినట్లు విచారణలో వెల్లడైంది. దీంతో ఎన్నికల సమయంలో ఈ భూమికి సంబంధించి భారీగా ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో ఈ భూమి పై క్రయవిక్రయాలు జరగకుండా ధరణిలో నిషేధిత జాబితాలో అధికారులు పెట్టారు. ఈ వ్యహారం కోర్ట్కు చేరడంతో న్యాయస్థానం ఆదేశాలతో అప్పటి ఎంఆర్ఒ జ్యోతి, జాయింట్ సబ్ రిజిస్ట్రార్, ఇఐసిఎల్ కన్స్ట్రాక్షన్ యజమాని కొండపల్లి శ్రీధర్పై కేసు నమోదైంది. రెండు కేసుల్లో భారీ స్థాయిలో ఆర్థిక లావాదేవీలు జరగడంతో ఇడి రంగంలోకి దిగింది.

## బాలానగర్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ నరసింహ రాజును కలసిన కార్పొరేటర్లు

**ఆవుల రవీందర్ రెడ్డి, పండాల సతీష్ గౌడ్**

టైమ్స్ ఆఫ్ వార్త - కూకట్ పల్లి




నూతనంగా బాలానగర్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన నరసింహ రాజు కి బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి, ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్, కలవడం జరిగింది ఈ సందర్భంగా ఇద్దరు కార్పొరేటర్లు సీఐ కి శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ బాలానగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ఖాజా నాయకులు మొహమ్మద్ బాబా,నర్రా దేవేందర్ రెడ్డి,నాగేందర్ గౌడ్,రంగంపేట్ శ్రీనివాస్,ప్రేమ్ కుమార్, వెంకట చారి,ఎం.సుధాకర్, నాగరాజ్ గౌడ్, గౌతమ్, ఫతేనగర్ డివిజన్ కోఆర్డినేటర్ సురేందర్ నాయుడు, బాగయ్యా, తదితరులు సీఐ ని కలిసిన వారిలో ఉన్నారు.

## అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ లక్ష్మణ్ యాదవ్కు శుభాకాంక్షలు

**పట్వారీ శశిధర్ టీమ్ సభ్యులు..**

టైమ్స్ ఆఫ్ వార్త - కూకట్ పల్లి

మహబూబ్నగర్ జిల్లా నూతన అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ (మూఢ) చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ కి శుభాకాంక్షలు తెలిపారు సీనియర్ కాంగ్రెస్ నాయకులు పట్వారీ శశిధర్ టీమ్ సభ్యులు. బుధవారం మహబూబ్ నగర్ లోని జె.జె ఫంక్షన్ హాలు లో ఏర్పాటు చేసిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొని ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతోసత్కరించారు. అనంతరం శశిధర్ మాట్లాడుతూ కాంగ్రెస్లో క్రమశిక్షణ కలిగిన నాయకుడిగా, సైనికుడిలా తాను చేసిన సేవలను గుర్తించి అధిష్టానం ఇంత గొప్ప బాధ్యతలు ఇవ్వటం తనకు ఎంతో ఆనందంగా ఉందని తన స్నేహితుడు ఇంత గొప్ప స్థాయికి చేరినందుకు సంతోషం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించి ప్రజలకు సేవలు అందించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..

